


కార్తీక సందడి

- శివాలయాల్లో ప్రత్యేక పూజలు
- అయ్యప్ప స్వామి దీక్షలు స్వీకరించిన వేలాది భక్తులు
- గోదావరిలో పుణ్య స్నానాలు, దీపాలు వదిలిన భక్తులు

7





ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ కళాశాల భవనం

నిర్మాణాలు.. నిధులకు.. ప్రణాళిక!

- ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీకి సీఎస్ఆర్ ఫండ్స్
- రూ.వెయ్యికోట్ల అంచనాలతో గతంలోనే ప్రతిపాదనలు
- ఇప్పటికే ఎన్ఎండీసీ, సింగరేణి, కోల్ ఇండియా సంస్థలతో చర్చలు
- మంజూరు చేసేలా సమన్వయం చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వచ్చేవారంలో సీఎంను కలిసిన అనంతరం తుది నిర్ణయం
- ఆర్కిటెక్ట్ డిజైన్లు, ఖర్చు అంచనాలు సిద్ధం చేయాలంటూ మంత్రి ఆదేశాలు
- ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ వీసీ యోగితా రాణాతో భేటీ

కొత్తగూడెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా కొత్తగూడెంలో నెలకొల్పిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ.. ప్రపంచస్థాయిలోనే మరింత ఖ్యాతి గడించేలా అడుగులు పడుతున్నాయి. ప్రపంచంలోనే రెండో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ కావడంతో ఈ వర్సిటీ ఏర్పాటుపై తొలి నుంచి మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవ చూపుతున్నారు. అన్ని హంగులు సమకూర్చేలా చర్యలు చేపడుతున్నారు. సింగరేణి మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా మారుస్తూ నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి దానికి సంబంధించిన నిర్మాణాలు చేపట్టడం, ఆయా నిర్మాణాలకు కావాల్సిన నిధులను సమకూర్చడం వరకు ప్రణాళికలు సిద్ధం చేస్తూ అధికారులకు సూచనలు చేస్తూ వస్తున్నారు. కాగా గతంలోనే ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పన, నిర్మాణ వ్యయాలు, విద్యార్థుల సౌకర్యాలకు రూ.వెయ్యి కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయగా.. ఆ అవసరాలను తీర్చేందుకుగాను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులను సమకూర్చుకోనున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే ఎన్ఎండీసీ, (మిగతా 6వ పేజీలో)

సీఎంతో చర్చించాక తుది నిర్ణయం : మంత్రి తుమ్మల

త్వరలో సీఎం చేతులమీదుగా యూనివర్సిటీ తరగతులను ప్రారంభించాలని నిర్ణయించగా.. యూనివర్సిటీకి సంబంధించిన భవనాల నిర్మాణ ప్రణాళిక, నిధుల అంశాలపై వచ్చే వారంలో సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నట్టు మంత్రి తుమ్మల వెల్లడించారు. సచివాలయంలో ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ వీసీ, విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణాతో బుధవారం ఆయన సమావేశమై యూనివర్సిటీ నిర్మాణ ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో తొలి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ కాగా, ప్రపంచంలో రెండోది మాత్రమేనని.. అత్యాధునిక వసతులతో నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠమైన ప్రణాళికను సిద్ధం చేస్తోందన్నారు. మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు యూనివర్సిటీకి పెట్టడం ప్రభుత్వం తీసుకున్న గౌరవప్రదమైన నిర్ణయమన్నారు. 300 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబోయే ఈ యూనివర్సిటీ, విద్యా, ఉపాధి రంగాల్లో నూతన అధ్యాయంగా మారనుందన్నారు. ప్రస్తుతం ఉన్న మైనింగ్ యూనివర్సిటీలో యూజీ, పీజీ కోర్సులు కొనసాగుతున్నాయని, వచ్చే విద్యా సంవత్సరం నుంచే పీహెచ్‌డీ కోర్సులు ప్రారంభించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా యూజీసీ నుంచి అవసరమైన అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ యూనివర్సిటీ నుంచి బయటకొచ్చిన వారు భవిష్యత్తులో భూ శాస్త్రవేత్తలు, ఖనిజ నిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారన్నారు. భూశాస్త్రం, పర్యావరణం, ఖనిజ సంపదల వినియోగం, వాతావరణ మార్పులపై పరిశోధనల్లో ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రముఖ కేంద్రంగా నిలవబోతోందన్నారు.



యోగితారాణాతో చర్చిస్తున్న మంత్రి తుమ్మల

మూడు చెక్‌పోస్టుల మూత

- ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి జిల్లా రవాణాశాఖ అధికారుల చర్యలు
- భద్రాద్రిలో రెండు, ఖమ్మం ఒక చెక్‌పోస్టుకు తాళం
- సిబ్బందిని ఉపసంహరించిన అధికారులు



పెనుబల్లి మండలం ముత్తగూడెం ఆర్టీఏ చెక్ పోస్టును తొలగిస్తున్న రవాణాశాఖ సిబ్బంది

చుంచుపల్లి/ఖమ్మం సంక్షేమవిభాగం/ పెనుబల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రవాణా శాఖకు సంబంధించిన అన్ని చెక్ పోస్టులను తక్షణమే మూసివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు రవాణా శాఖ కమిషనర్ జిల్లా రవాణాశాఖ అధికారులకు ఉత్తర్వులు పంపారు. దీంతో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల రవాణా శాఖ అధికారులు అశ్వారావుపేట, పాల్వంచ, ముత్తగూడెం వద్ద ఉన్న ఆర్టీఏ చెక్ పోస్టులను మూసేశారు. బారికేడ్లను తొలగించి.. చెక్‌పోస్టులు మూసి వేసినట్టు బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే చెక్‌పోస్టుల వద్ద విధుల్లో ఉన్న సిబ్బందిని ఉపసంహరించి.. ఈ తొలగింపు ప్రక్రియను మొత్తం వీడియో తీసి.. ఉన్నతాధికారులకు అందించేందుకు నివేదికను సిద్ధం చేశారు. అలాగే చెక్‌పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, ఫర్నీచర్, ఇతర సామగ్రి, కంప్యూటర్లు, ఇతర వస్తువులను తక్షణం డీటీవో కార్యాలయానికి తరలించాలని సిబ్బందికి సూచించారు. ఆ ప్రాంతాల్లో పరిపాలనకు సంబంధించిన రికార్డులు, నగదు పుస్తకాలు, రశీదులు, చలాన్ల రికార్డులను డీటీవో కార్యాలయంలో భద్రపరచాలని స్పష్టం చేశారు. చెక్‌పోస్టుల తొలగింపు ప్రక్రియను ఇరుజిల్లాల రవాణాశాఖ అధికారి ఎం.వెంకటరమణ పర్యవేక్షించారు. ఆయన వెంట కొత్తగూడెం ఎంవీఐ మనోహర్, ఖమ్మం ఎంవీఐ రాజశేఖర్, ఏఎంవీఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది బడేసాహెబ్, సరిత, అశోక్ తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ గతనెలలోనే చెక్‌పోస్టులను ప్రభుత్వం ఎత్తివేసిందని, నెలరోజులపాటు ఆన్‌లైన్ ద్వారా సేవలందిస్తామని తెలియజేసేందుకు ఇప్పటివరకు వీటిని నిర్వహించామన్నారు. తాత్కాలిక పర్మిట్లు, ఇతర సేవలను కూడా ఆన్‌లైన్‌లో అందజేస్తామన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న దేవస్థానం ఈవో దామోదర్‌రావు

సహకరించండి.. తరించండి

- రామాలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కండి
- రశీదు లేదా పాస్ చూపించినా దర్శనానికి అనుమతి
- 'దాతలకు సత్కారం'లో భద్రాద్రి దేవస్థానం ఈవో దామోదర్‌రావు

వివరాలు : 6లో

ఏజెన్సీలో మద్యం కిక్కు

- బెల్ట్‌షాప్‌ల జోష్‌తో భారీగా దరఖాస్తులు
- మన్యం మద్యం షాపులపై సిండికేట్ల కన్ను
- దరఖాస్తుల్లో సెంచరీ కొట్టిన జగన్నాథపురం

ఇల్లెందు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గ్రామాల్లో బెల్టుషాపులతో కాసుల వర్షం కురుస్తున్న అనుభవాలు కలిగిన మద్యం వ్యాపారులు ఏజెన్సీ ప్రాంతాల మద్యం దుకాణాలు దక్కించుకోవాలన్న యోచనతో భారీగా దరఖాస్తులు చేస్తున్నారు. ఏజెన్సీ మండలాల్లో బెల్టుషాపుల అమ్మకాలు జోరుగా సాగుతుండటంతో ఏజెన్సీ మండలాల మద్యం దుకాణాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఏజెన్సీ ప్రాంతాల్లో మద్యం షాపులను దక్కించుకుంటే మండల పరిధిలోని గ్రామాల్లో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగించుకోవచ్చన్న యోచనతో భారీ సంఖ్యలో దరఖాస్తులు చేశారు. భద్రాది జిల్లా వ్యాప్తంగా మొత్తం 88మద్యం దుకాణాలు ఉండగా.. వాటిలో 44 దుకాణాలు ఏజెన్సీ ప్రాంతాలకు చెందినవి కావడం గమనార్హం. మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గురువారం ఆఖరుతేదీ కావడంతో పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసేందుకు మద్యం వ్యాపారులు, సిండికేట్లు సన్నాహాలు చేసుకుంటున్నారు. బుధవారం సాయంత్రానికి భద్రాద్రి జిల్లాలో 88మద్యం దుకాణాలకు 3,815 దరఖాస్తులు రాగా వీటిలో కేవలం ఏజెన్సీ మండలాల్లోని 44 మద్యం దుకాణాలకు 2,122 దరఖాస్తులు దాఖలు కావడం గమనార్హం. గతేడాది కన్నా ఈ ఏడాది దరఖాస్తు రుసుం రూ.లక్ష పెంచినప్పటికీ మద్యం వ్యాపారంలో లాభాలు ఇబ్బడిముబ్బడిగా వస్తాయన్న ఆశతో పెద్ద ఎత్తున దరఖాస్తులు చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని మద్యం దుకాణాలకు సగటున 45 నుంచి 60 దరఖాస్తుల మేర సమర్పించారు. ఇల్లెందు పట్టణంలో 8 మద్యం షాపులుండగా 206 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఏజెన్సీ మండలంలోని కేపీ జగన్నాథపురం మద్యం దుకాణానికి 100 దరఖాస్తులు దాఖలయ్యాయి. కాగా మణుగూరులోని బండారుగూడెంలో అత్యల్పంగా 1, 2, 6 నెంబర్ల మద్యం దుకాణాలకు కేవలం 21 దరఖాస్తుల చొప్పున దాఖలు కావడం గమనార్హం. ఇల్లెందు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని టేకులపల్లిలో 4 మద్యం దుకాణాలు ఉండగా వాటి కోసం 194 మంది దరఖాస్తు చేశారు. గుండాల మండలంలో ఒకే మద్యం దుకాణం ఉండగా.. దాని కోసం 80 దరఖాస్తులు దాఖలయ్యాయి. అదే విధంగా చంద్రుగొండ మండలంలో 2 మద్యం షాపులకు 126, (మిగతా 6వ పేజీలో)



టీచర్ల మెడపై టెట్ కత్తి!



- గందరగోళంగా అర్హత పరీక్ష అంశం
- వైరల్‌గా మారిన ఎన్‌సీటీఈ తిరస్కరణ
- ఉద్యోగ భద్రతపై అలుముకున్న నీలినీడలు
- శాశ్వత పరిష్కారం కోసం ఉపాధ్యాయుల ఎదురుచూపులు

రాత్రింబవళ్లు కష్టపడి చదివి తాము ఎంచుకున్న ఉద్యోగ అర్హత పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చాటి ఉద్యోగాలు సాధించారు. వారందరికి నాటి సీఎం చేతుల మీదుగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నియామక పత్రాలను ఇవ్వడంతో కొలువులు చేపట్టారు. ఒక్కో ఉద్యోగి రెండు నుంచి మూడు దశాబ్దాల సర్వీసును పూర్తి చేశారు. కానీ 'కొత్త ఒక వింత.. పాత ఒక రోత' అన్న చందాన నూతన నియమ, నిబంధనలను ఒక్కసారిగా తెరపైకి రావడం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు శాపంగా మారింది. వారి ఉద్యోగాలకే ఎసరు పెట్టేలా ఉండటంతో వేలాది మంది టీచర్ల భవిష్యత్ ప్రమాదంలో పడటంతో గండం నుంచి బయట పడటం కోసం దారులు వెతుకుతున్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులతో పాటు ప్రజా ప్రతినిధులు, న్యాయ కోవిదుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

బోనకల్/ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల మెడపై టెట్ కత్తి వేలాడుతోంది. ఉద్యోగ విరమణకు ఐదేళ్ల సర్వీసులోపు ఉన్న టీచర్ల మినహా మిగిలిన వారంతా సర్వీసులో కొనసాగాలంటే తప్పనిసరిగా రెండేళ్ల కాలవ్యవధిలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో ఉత్తీర్ణులు కావాలని లేకుంటే ఉద్యోగం నుంచి తప్పుకోవాల్సి ఉంటుందని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు విద్యాశాఖలో కలకలం రేపింది. 2010 డీఎస్సీ కన్నా ముందున్న టీచర్లంతా టెట్ రాయాల్సి ఉంటుందని, దీనిపై ఉపాధ్యాయ వర్గాల్లో భిన్నభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 4,963 మంది ఉపాధ్యాయులు పని చేస్తుండగా, ఐదేళ్ల సర్వీసుతో రిటైర్డ్ అయ్యే టీచర్లు దాదాపు 1,200 మంది వరకు ఉంటారని, వీరిని మినహాయిస్తే మిగిలిన వారందరికి టెట్ గండం పొంచి ఉంది.

అర్హత పరీక్షతో అయోమయం..

పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు గానూ కేంద్ర ప్రభుత్వం గత 2009లో విద్యాహక్కు చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులందరికీ ఒకే రకమైన విద్యార్హత, ప్రమాణాలు ఉండాలని ఇందుకు సంబంధించి విధి విధానాలను విద్యాహక్కు చట్టంలో పేర్కొంది. దీంతో 2010 నుంచి నిర్వహించిన టీచర్ల నియామకాల్లో ఎన్‌సీటీఈ టెట్ పరీక్షను తప్పనిసరి చేయగా, ముందుగా టెట్ రాసి అందులో ఉత్తీర్ణులైన వారు డీఎస్సీ రాసి ఉద్యోగాలు పొందారు. కానీ 2010 కన్నా ముందు సర్వీసులో ఉన్న టీచర్లు ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగంలో కొనసాగటానికి మాత్రం టెట్ పరీక్ష రాయాలని ఎన్‌సీటీఈ ఎక్కడా పేర్కొనలేదు. దీంతో ప్రమోషన్ పొందడానికి మాత్రమే (మిగతా 6వ పేజీలో)

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషిచేయాలి

- ప్రధాన రోడ్లు, హైవేలపై బ్లాక్‌స్పాట్స్ గుర్తించాలి
- పాఠశాలల వద్ద స్కూల్ జోన్ సూచికలు పెట్టాలి
- రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పక్కన సీపీ సునీల్‌దత్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఆయన 8వ జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో స్థానిక మునిసిపాలిటీలు బాధ్యతలు తీసుకొని రోడ్ల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో 10రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి రోడ్ల గుంతలను పూడ్చి వేశామన్నారు. కల్లూరు, వైరా, సతుపల్లి, మధిర, ఏదులాపురం మునిపిపాలిటీల రోడ్లపై గుంతలను గుర్తించి 15 రోజుల్లో పూడ్చి వేయాలన్నారు. నేషనల్ హైవే 365 బీబీ ఖమ్మం నగరానికి బైపాస్ సెక్షన్‌గా ఉంటుందని, ఖమ్మం బైపాస్ వద్ద మరమ్మతు పనులు చేపట్టాలని, అక్కడ రోడ్డు భద్రత ప్రమాణాల కింద రంబుల్ స్ట్రిప్స్, రేడియం స్టిక్కర్, స్పీడ్ బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హైవే పై ఉన్న జంక్షన్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఖమ్మం - కోదాడ, వరంగల్ జంక్షన్ పరిధిలో ఉన్న స్ట్రెచ్‌ను ఆర్అండ్‌బీ అధికారులు పర్యవేక్షించాలన్నారు. మునిసిపల్, ఎన్‌హెచ్ రెవెన్యూ, పోలీస్, ఆర్అండ్‌బీ అధికారులు సంయుక్తంగా ఈ నెల 24న బైపాస్ నుంచి కలెక్టరేట్ వరకు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి తీసుకోవాల్సిన చర్యలపై 29వతేదీ నాటికి నివేదికలను అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో పాఠశాలల వద్ద ఉన్న రోడ్లపై స్కూల్ జోన్, గో స్లో రేడియం స్టిక్కర్లతో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఏఐ సాంకేతికతను వాడుతూ రాంగ్ సైడ్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన సంఘటనలు గుర్తించి వారికి చట్ట ప్రకారం జరిమానాలు విధించాలని, ట్రాఫిక్ నిబంధనలు, ఏఐ సాంకేతిక వినియోగం పట్ల ప్రచారం కల్పించాలని కలెక్టర్ తెలిపారు. పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ కనెక్టింగ్ రోడ్డు, టీ-జంక్షన్ వద్ద ఎన్‌హెచ్ తరపున రంబుల్ స్ట్రిప్స్, ఆర్అండ్‌బీ, పంచాయతీ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో పార్కింగ్ లేకుండా నూతన పాఠశాలలకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతివ్వొద్దన్నారు. ప్రతీ ప్రైవేట్ పాఠశాల పార్కింగ్ స్పేస్ గుర్తించాలని లేదంటే భవిష్యత్‌లో అనుమతుల రెన్యువల్ నిలిపివేయాలని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ నేషనల్ హైవే వద్ద జరిగిన ప్రమాదాల దృష్ట్యా బ్లాక్ స్పాట్స్ గుర్తించి వాటి సమీపంలో గల ఆస్పత్రులకు మ్యాచ్ చేయాలని, అక్కడ ట్రామా సెంటర్ ప్రాథమిక సేవలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఎ. పద్మశ్రీ, ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకుబ్, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, నేషనల్ హైవే పీడీలు రామాంజనేయరెడ్డి, దివ్య, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్డీవో, పోలీసు, మునిసిపల్, అధికారులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు



కార్యక్రమానికి హాజరైన దాతలు



దాతలను సత్కరిస్తున్న దేవస్థానం ఈవో

సహకరించండి.. తరించండి

- రామాలయ అభివృద్ధిలో భాగస్వాములు కండి
- రశీదు లేదా పాస్ చూపించినా దర్శనానికి అనుమతి
- 'దాతలకు సత్కారం'లో భద్రాద్రి దేవస్థానం ఈవో దామోదర్‌రావు

భద్రాచలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సీతారామచంద్రస్వామి కొలువుదీరిన భద్రాచలంలో ఆలయాభివృద్ధికి వివిధ రూపాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న అందరికీ ధన్యవాదాలని, మ ముున్ముందు కూడా ఇలాగే సహకరించి.. క్షేత్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని భద్రాచలం దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు దాతలను కోరారు. బుధవారం భద్రాచలంలో దేవస్థానం ఆధ్వర్యంలో 'దాతలకు సముచిత సత్కారం' కార్యక్రమం జరగ్గా.. తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి దాతలు తరలొచ్చారు. ఈ సందర్భంగా ఈవో దామోదర్‌రావు మాట్లాడుతూ వివిధ రూపాల్లో దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని, వారి సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకొని ముున్ముందు మరింత మెరుగైన సేవలందించేందుకు అంకితభావంతో కృషి చేస్తామన్నారు. దాతలు తాము దేవస్థానానికి వివిధ రూపాల్లో అందజేసిన వాటికి సంబంధించి రసీదు లేదా దేవస్థానం అందజేసిన డోనర్ పాస్ చూపించినా రామలయంలోని ప్రొటోకాల్ విభాగంలో స్వామి వారిని దర్శించేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు అప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా దాతలను ఆయన సత్కరించారు. అంతకు ముందు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాతలు ముందుగా రామయ్య మూలవరులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్కారంలో భాగంగా దాతలకు స్వామి వారి కండువా, జాకెట్ ముక్కలు, రెండు లడ్డూలు, స్వామి వారి చిత్రం, క్యాలెండర్‌తో కూడిన కిట్‌ను ఈవో అందజేశారు. ఇదిలా ఉండగా భద్రాద్రి ఆలయ దినదినాభివృద్ధి చెందిన వైనాన్ని వీడియోద్వారా దేవస్థానం రామాయణపారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు వివరించారు. కార్యక్రమానికి వచ్చిన వారికి అల్పాహారం, స్వామి వారి అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ వి.రవీంద్రనాథ్, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, అరుణ్‌కుమార్, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, ముఖ్య అర్చకులు శ్రీ పెరంబుదూర్ మదన్‌మోహనాచార్యులు, రామాయణపారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

దాతల పట్ల సిబ్బంది తీరులో మార్పు రావాలి

ఆలయ సందర్శన సమయంలో తమ పట్ల సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు సమంజసంగా లేదని వారి తీరులో మార్పు రావాలని పలువురు దాతలు పేర్కొన్నారు. దాతల సత్కార సభలో పలువురు దాతలు మాట్లాడుతూ గతంలో తాము రామాలయాన్ని సందర్శించిన సమయంలో విరాళం అందజేస్తే రసీదు కోసం ఆలయంలో, కార్యాలయంలో ఇస్తారని తిప్పించారని తమకు ఎదురైన అనుభవాలను గుర్తు చేశారు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన దాతల సత్కారం కార్యక్రమాన్ని ఈ ఏడాది సైతం కొనసాగించడం పట్ల దాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా పలువురు దాతలకు దాతల సత్కారం విషయమై వాట్సప్ ద్వారా లేదా లెటరు ద్వారా ఎలాంటి సమాచారం అందలేదని, పలువురు ఉద్యోగులకు కూడా సమాచారం రాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సేంద్రియ వరి సాగు

అదరహో..

- రసాయన ఎరువుల్లేకుండానే సాగు
- అధిక దిగుబడులు సాధిస్తున్న రైతు విష్ణువర్ధన్‌రెడ్డి
- పసుపు, పలురకాల కూరగాయల సాగుపైనా ఆసక్తి



సేంద్రియ సాగులో చేపట్టిన పసుపు పంట

కారేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పంటలసాగు కోసం వేలాది రూపాయాలు ఖర్చుపెట్టి క్రిమిసంహారక మందులకు ఖర్చుపెట్టిన పంటల దిగుబడులు సరిగా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్న రైతులను అనేకం మందిని చుస్తున్నాం. కానీ క్రిమిసంహరక, కాంప్లెక్స్ మందుల కోసం ఒక్క పైసకూడా ఖర్చుపెట్టకుండా ఆర్గాన్‌పంటలపై దృష్టి సారించి అధిక దిగుబడులు సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు రైతు



సేంద్రియ వరిపంటను చూపిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

సూరపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి.

కారేపల్లి మండలం విశ్వనాథపల్లి పంచాయతీ లింగంబంజర గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి గ్రామంలో తనకున్న రెండున్నర ఎకరాలలో వరిపంటసాగు చేశాడు. ఎకరాకు 35నుంచి 40బస్తా వరకు దిగుబడి వస్తుందని రైతు తెలిపారు. పంటసాగు సమయంలో నాలుగు ట్రక్కుల పశువుల ఎరువు, దమ్ముల చేసేసమయంలో పచ్చిరొట్టను పొలంలోనే కలియదున్నినట్లు తెలిపారు. కామేపల్లి సహకార సొసైటీలో సాంబమసురి బీటీ వరివంగడం నారు పోసుకుని నాటు వేసుకున్నట్లు తెలిపారు. కనీసం ఎలాంటి కలుపుమొక్కలు కూడా లేకుండా వరిపంట చేతికి వస్తుందన్నారు. వరి పంటను సాగు చేస్తున్నరైతు రెండు సంవత్సారాలుగా దిగుబడులు సాదిస్తున్నారు. వరి పంటసాగుతో పాటు అర్గాన్ పుసుపు,అనేక రకాల కూరగాయాలు పండిస్తు,తన ఇంటితో పాటు ఇంటి పరిసర ప్రాంతాల వారికి ఉచితంగానే ఇస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వకాలంలో తల్లిదండ్రులు ఏలాంటి పెట్టుబడులు పెట్టకుండానే పంటలు పండించారని, ఇప్పుడు వ్యవసాయం చేస్తున్న రైతులు పూర్తిగా సేందియ ఎరువులపై దృష్టి పెట్టి పంటలు సాగు చేసుకోవాలన్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు తినడం వల్లన మంచి ఆరోగ్యంతో ఉంటామని తెలిపారు.

సస్యరక్షణ చర్యలను చేపట్టాలి

● కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

జూలూరుపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో సస్యరక్షణ చర్యలను చేపట్టినట్లయితే తెగుళ్లను అరికట్టవచ్చని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శరత్‌చంద్ర, శివలు తెలిపారు. బుధవారం మండలంలోని రామచంద్రాపురం, అన్నారుపాడు గ్రామాలను వారు సందర్శించి రైతులు సాగుచేసిన పత్తి, మిర్చి, వరి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ భరత్, ఏవో దీపక్‌ఆనంద్, ఏఈవో గౌస్ తదితరులు పాల్గొన్నారు.



అన్నారుపాడులో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నిర్మాణాలు, నిధులకు.. ప్రణాళిక!

(5వ పేజీ తరువాయి)

సింగరేణి కోల్ ఇండియా సంస్థల ప్రతినిధులతో చర్చించగా.. త్వరలో దానికి ఆమోదం లభించే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది.

అగ్రశ్రేణి ఆర్కిటెక్ట్‌లతో ప్లాన్ రూపకల్పన

కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రస్తుతం మైనింగ్ కళాశాలలో ఉన్న భవనాల్లోనే కొనసాగిస్తున్నారు. దాన్ని రాబోయే రోజుల్లో 300ఎకరాల్లో తీర్చిదిద్దనున్నారు. విద్యార్థులు, అధ్యాపకులకు సౌకర్యవంతమైన వాతావరణం ఉండేలా తరగతి గదులు, హాస్టళ్లు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు నిర్మించనున్నారు. కాగా ఆయా అంశాలకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. 20కి పైగా బ్లాకులు ఏర్పాటు చేయనుండగా.. నాలుగు వేలమంది విద్యార్థులు చదివేలా, వారికి అవసరమైన హాస్టల్ భవనాల్లో ఒక్కో గదికి ఇద్దరు మాత్రమే ఉండేలా 1300 గదుల వరకు నిర్మించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఆరు బ్లాకుల వరకు అడ్మినిస్ట్రేషన్ వరకు ఉపయోగించనున్నట్టు తెలుస్తోంది. వీటితోపాటుగా గ్రంథాలయం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ వంటి నిర్మాణాలను చేపట్టనున్నారు. అయితే ప్రభుత్వానికి ప్రతిపాదించిన రూ. వెయ్యి కోట్ల అంచనాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రామాణికంగా ఉన్నట్టు తెలుస్తోంది. అంతేకాదు ఎంతోమందిని శాస్త్రవేత్తలను తయారుచేసే యూనివర్సిటీకి ప్రయోగశాలలను ముఖ్యంగా భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందుకోసం ఒక్కో థియరీకిగాను ఒక్కో ప్రయోగశాల చొప్పున 54 ప్రయోగశాలల వరకు నిర్మించాల్సిన ఆవశ్యకత ఉంది. వాటిల్లో అండర్ గ్రాడ్యుయేషన్‌కు 24, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు మరో 30 ప్రయోగశాలలు నిర్మించనున్నారు. ఇక కంప్యూటర్ ల్యాబులు, ఏసీ లాంటి ఇతర మౌలిక సదుపాయాల కల్పన సర్వసాధారణమే. అయితే వీటన్నింటికి సంబంధించిన నిర్మాణాలను చేపట్టేందుకు అగ్రశ్రేణి ఆర్కిటెక్ట్‌ల ద్వారా ప్లాన్‌లను రూపొందించనున్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

» కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్య అందించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం పట్టణంలోని బాబు క్యాంపు ప్రాంతంలో ఉన్న పీఎం శ్రీ ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రాన్ని సందర్శించారు. టీవీలను ఉపయోగిస్తున్నారా.. వీటి ద్వారా పాఠ్యాంశాలను బోధిస్తున్న తీరు ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం ప్రతి పాఠశాలను ఉత్తమ ప్రమాణాలతో అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, ఈ పాఠశాలలు భవిష్యత్తులో దేశానికి మార్గదర్శకులుగా నిలిచే విద్యార్థులను తయారు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ బాబు క్యాంపులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ప్రధానోపాధ్యాయురాలు నీరజ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

రైతులు ఆర్థిక లాభాలు సాధించాలి

కొత్తగూడెం కలెక్టరేట్: లైవ్‌హుడ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా రైతులకు ఆర్థిక లాభాలు సాధించాలని, జిల్లా వ్యాప్తంగా మోడల్ యూనిట్లను స్థాపించాలని, రుణ బకాయిలను ప్రణాళికాబద్ధంగా వసూలు చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కోరారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని అన్ని రుణ బకాయిలను ప్రణాళికాబద్ధంగా వసూలు చేయడం అత్యవసరం అని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా లైవ్‌హుడ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని, వాటి కోసం అవసరమైన స్థలాలను గుర్తించమని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పోలీసులపై దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

పాల్వంచ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసులపై దాడి చేసిన వ్యక్తికి బుధవారం కొత్తగూడెం కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ నెల 15న పాల్వంచ జయమ్మకాలనీకి చెందిన జట్‌పట్ రమేష్ అర్ధరాత్రి అకారణంగా విధుల్లో ఉన్న కానిస్టేబుల్, హోంగార్డులపై రాళ్లతో దాడి చేసి గాయపరిచిన ఘటన పాల్వంచలో సంచలనం రేకెత్తించింది. ఈ ఘనటనలో నిందితుడు జట్‌పట్ రమేష్‌పై కేసు నమోదు చేసిన పాల్వంచ టౌన్ పోలీసులు అతనిని అరెస్టు చేసి కొత్తగూడెం కోర్టులో హాజరుపరిచారు. నిందితుడికి జడ్జి 14 రోజుల రిమాండ్ విధించగా పాల్వంచ పోలీసులు భద్రాచలం సబ్‌జైలుకు తరలించారు.

కల్లూరులో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ వేగవంతం



కల్లూరు మునిసిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియపై కసరత్తు చేస్తున్న సిబ్బంది

కల్లూరు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మునిసిపాలిటీ పరిధిలోని అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ ప్రకియను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా మునిసిపాలిటీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 1,851 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 1,747 మందికి గాను ఫీజు చెల్లించమని వారి సందేశం చేరిందన్నారు. అందులో ఇప్పటి వరకు 237 మంది ఫీజు చెల్లించారని తెలిపారు. ఫీజు చెల్లించిన వారి దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి 110 మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చారని చెప్పారు. ఫీజు చెల్లించి సరైన ధ్రువపత్రాలు సమర్పించని 69 మందికి పత్రాలు సమమర్పించాల్సిందిగా మరల వారికి సమాచారం అందించినట్లు తెలిపారు. అలాంటి వారు తమ సెల్ ఫోన్ నుండి పత్రాలను అప్లోడ్ చేసి ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసిడింగ్స్ పొందుటకు సహకరిం చాల్సిందిగా టౌన్ ప్లానింగ్ అధికారి భాస్కర్ తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ సర్వీసులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

భద్రాచలం/జూలూరుపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి కార్తీక మాసం సందర్భంగా పంచారామక్షేత్రాలకు ప్రత్యేక ప్యాకేజీపై తీసుకెళ్లనున్నట్లు ఆర్టీసీ డీఎం జంగయ్య తెలిపారు. అక్టోబరు 26, నవంబరు 2,9, 16 తేదీల్లో ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు సూపర్ లగ్జరీ బస్ బయలుదేరుతుందని పేర్కొన్నారు. పెద్దలకు రూ.2150, పిల్లలకు రూ.1100 చార్జీగా వసూలు చేయనున్నట్లు తెలిపారు. అలాగే అన్నవరంకు రూ.720, పిల్లలకు రూ.410 వసూలు చేయనున్నట్లు వివరించారు.

జూలూరుపాడు: కార్తీక మాసాన్ని పురస్కరించ ుకొని భక్తుల సౌకర్యార్థం పుణ్యక్షేత్రాలకు కొత్తగూడెం ఆర్టీసీ డిపో వారి అధ్వర్యంలో ప్రత్యేకంగా బస్సు సర్వీస్‌లను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ వీబీవోలు ఇసాన్నపల్లి సామ్యూల్, ఎస్కే రహీంలు తెలిపారు. డిపో మేనేజర్ యు రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు బుధవారం జూలూరుపాడులో వారు ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఉడత వెంకటేశ్వర్లు, నాయకులు మహంకాళి గోపాలకృష్ణ, ఉడత వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో

రౌడీషీటర్ రిమాండ్

- అతడి వేధింపులే మహిళ మృతికి కారణం
- ఖమ్మం జిల్లాలో సంచలనం రేపిన ఘటన

రఘునాథపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తన లైంగిక వాంఛ తీర్చాలంటూ ఓ రౌడీషీటర్ పెట్టిన వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖమ్మం జిల్లాలో తీవ్ర సంచలనం రేపింది. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మహిళ ఆత్మహత్యకు కారణమైన ఆ రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరిఫ్ వెల్లడించారు. వి.వెంకటాయపాలేనికి చెందిన బోడా సుశీల(28) వ్యవసాయ కూలి పనులకు వెళుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఈనెల 18న తమ గ్రామానికి పొరుగున ఉన్న తనికెళ్ల గ్రామంలోని ఓ రైతుకు చెందిన పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లింది. అయితే సుశీల ఇంటి ఎదుట నివాసం ఉండే రౌడీషీటర్ ధరావత్ వినయ్‌కుమార్ ఆమెపై కన్నేశాడు. వ్యవసాయ పనులకు వెళ్లిన తనికెళ్ల పొలం వరకు వెంబడించాడు. అక్కడ సుశీలతో వాగ్వాదానికి దిగగా.. అతడి నుంచి తప్పించుకున్న సుశీల వి వెంకటాయపాలెంలోని తన ఇంటికి చేరుకుంది. ఆ తర్వాత 20వతేదీన సాయంత్రం సుశీల ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో వినయ్‌కుమార్ ఆమె ఇంటి ఆవరణలోకి వెళ్లి మరోసారి గొడవపడ్డాడు. 'నా కోర్కె తీర్చు. లేదంటే చచ్చిపో' అంటూ బెదిరించడంతో పాటు ఆమెపై దాడికి యత్నించాడు. ఇదంతా చుట్టుపక్కల వారు చూడటంతో అవమానంగా భావించిన సుశీల ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యకు చేసుకుంది. ఆ తర్వాత ఇంటికి చేరుకున్న సుశీల భర్త శివకుమార్ బంధువులకు సమాచారమిచ్చి.. భార్య శరీరంపై గాయాలు ఉండటంతో ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సుశీల మృతదేహాన్ని ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అయితే తన భార్య ఆత్మహత్యకు వినయ్‌కుమార్ వేధింపులే కారణమని, అతడు తన ఇంటికి వచ్చి ఆమెపై దాడి చేయడం వల్ల అవమానానికి గురైన తన భార్య ఆత్మహత్య చేసుకుందని శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో వినయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. మృతురాలు సుశీల, శివకుమార్ దంపతులకు రెండేళ్ల కుమారుడున్నాడు. నిందితుడు ధరావత్ వినయ్‌కుమార్‌పై గతనెలలోనే రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ నమోదైంది. వి.వెంకటాయపాలెం గ్రామంలో అలజడులు సృష్టించటం, పలువురి నివాసాలపై దాడులు చేస్తుండటం, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తుంటంతో గ్రామస్థులు అతడిపై పలుమార్లు ఫిర్యాదులు చేశారు. దాంతో అతడిపై పలు కేసులు నమోదవగా.. గతనెలలోనే వినయ్‌కుమార్‌పై పోలీసు రౌడీ షీట్ ఓపెన్ చేశారు. తాజాగా అతడి దుశ్చర్యకు ఓ వివాహిత బలవడం తీవ్ర చర్చనీయాంశమైంది.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉస్మాన్ షరిఫ్

ఏజెన్సీలో మద్యం కిక్కు

(5వ పేజీ తరువాయి)

జూలూరుపాడు మండలంలో 2 షాపులకు 135 దరఖాస్తులు దాఖలయ్యాయి. కాగా ఆళ్లపల్లి మండలంలో ఒకే మద్యం దుకాణంకోసం 75 దరఖాస్తులు వచ్చాయి. కాగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసేందుకు గురువారం ఆఖరిరోజు కావడంతో వీటి సంఖ్య మరింత పెరిగుతుందన్న ఆశాభావంతో ఎక్సైజ్ అధికారులు ఉన్నారు.

భద్రాద్రి జిల్లాలో 3816 దరఖాస్తులు

చుంచుపల్లి : నూతన మద్యం దుకాణాలకు భద్రాద్రి జిల్లాలో 3,816 దరఖాస్తులు వచ్చాయని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కె.జానయ్య తెలిపారు. బుధవారం 9 మంది అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్టు పేర్కొన్నారు. 2025-27 కాలపరిమితికిగాను జిల్లాలోని దరఖాస్తు చేసుకునే ఆశావాహులకు చివరి గడువు గురువారంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తు చేశారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

ఖమ్మం లీగల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని సంభానినగర్‌కు చెందిన మామిడి పద్మకి చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ.ఐదు లక్షల నష్ట పరిహారం కింద చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పు చెప్పారు. ఖమ్మం నగరానికి చెందిన మేకల రాంబాబు వద్ద నిందితురాలు రూ.ఐదు లక్షలను 2020లో అప్పుగా తీసుకుంది. తన రుణం తిరిగి చెల్లించమని అడగగా 30 జూన్ 2023న రూ.5లక్షలకు చెక్కు జారీ చేసింది. అట్టి చెక్కును ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమచేయగా సరిపడ నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. బాధితుడు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేయగా, కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆరుగురిపై కేసు నమోదు

పాల్వంచ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై అకారణంగా దాడి చేసిన ఆరుగురిపై పాల్వంచ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పాల్వంచ మండలం నాగారానికి చెందిన అయిల పాక హరీష్ మండల పరిధిలో జగన్నాధపురంలోని ఓ వైన్ షాపు వద్దకు తన బంధువు కోసం వెళ్లాడు. ఇంతలో అక్కడే ఉన్న బూర్గంపాడుకు చెందిన ఆరుగురు మద్యం మత్తులో ఆకరణంగా హరీష్‌తో వాగ్వాదానికి దిగి అతనిపై భౌతిక దాడికి పాల్పడి గాయపరిచారు. హరీష్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

టీచర్ల మెడపై టెట్ కత్తి

(5వ పేజీ తరువాయి)

టెట్ రాయడం జరిగేది. కానీ ఇటీవల టెట్ రాస్తేనే ఉద్యోగం ఉంటుందన్న ఉత్తర్వులు ఉపాధ్యాయులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎందుకంటే ప్రస్తుతం నిర్వహిస్తున్న టెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలంటే కేటగిరీల వారీగా 60శాతం, 50శాతం, 40శాతం మార్కులు రావాలి.

చర్చనీయాంశమైన 'తిరస్కరణ' వార్తలు..

2010 కన్నా ముందున్న ఇన్ సర్వీసు టీచర్లంతా తమను టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎన్‌సీటీఈకి విజ్ఞప్తి చేశారు. కానీ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఎన్‌సీటీఈ ఉపాధ్యాయుల విజ్ఞప్తిని తిరస్కరించినట్టు వస్తున్న వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల నియామకానికి ఇంటర్మీడియట్, డీఈడీ, టెట్ పేపర్ ఉత్తీర్ణత కావాల్సి ఉంటుంది. ఉన్నత పాఠశాలల్లో పని చేసే టీచర్ల నియామకాలకు గానూ డిగ్రీ, బీఈడీ, టెట్ ఉత్తీర్ణత కావాల్సి ఉంటుంది. కాని 2010 కన్నా ముందు డీఎస్సీల్లో ప్రాథమిక పాఠశాలల్లో నియమితులైన వాళ్లల్లో ఎక్కువ మంది బీఈడీ పూర్తి చేసిన వాళ్లే ఉన్నారు. విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చిన తరువాత గతంలో సర్వీసులో కొనసాగుతున్న టీచర్ల విద్యార్హతల గురించి కూడ చర్చ నడుస్తుంది. గతం, ప్రస్తుత విద్యా విధానాల్లో చోటు చేసుకున్న మార్పులు ఉపాధ్యాయ వర్గాలను కుదిపేస్తోంది.

ఉద్యోగ భద్రతకు అగ్ని'పరీక్ష'

ప్రాథమిక పాఠశాలల్లో దశాబ్దాల తరబడి ప్రమోషన్లు పొందకుండా సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న ఉపాధ్యాయులు కొలువుల్లో కొనసాగడానికి టెట్ రాయాల్సి ఉందన్న ఆదేశాలతో వారిలో ఉద్యోగ భద్రత పై సందేహాలు నెలకొన్నాయి. మారిన కాలనుగుణంగా టెట్ పరీక్ష ఇంటర్ స్థాయిలో ప్రశ్నలు ఉండటంతో పాటు అర్హత సాధించేందుకు కూడా ఎక్కువ మార్కులు రావాల్సి ఉంది. ప్రాథమిక స్థాయిలో విద్యను అందించే టీచర్లు తమ ఉద్యోగాన్ని కాపాడుకునేందుకు చివర్లో పరీక్షలు రాయాల్సి రావడం అగ్ని పరీక్షగా మారింది. ఒకసారి పరీక్ష రాసి ఉద్యోగంలోకి వచ్చిన తాము మళ్లీ ఉద్యోగాన్ని నిలుపుకొనేందుకు మరోసారి పరీక్ష రాయడమేంటని ప్రశ్నిస్తున్నారు. టెట్ నుంచి మినహాయింపు పొందేందుకు పలువురు ప్రజాప్రతినిధులు, న్యాయ కోవిదులను ఆశ్రయిస్తున్నారు. వారు చివరి పరీక్ష నుంచి మినహాయింపు పొందేనా? లేక పరీక్ష రాసి బయట పడేనా? లేకపోతే వారి పరిస్థితి ఎలా ఉండబోతుందో? వేచి చూడాలి.

టెట్ తీర్పుపై అప్పీలు చేయాలి

● పారుపల్లి నాగేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టు ఇచ్చిన టెట్ తీర్పుపై అప్పీలు చేసి సమర్థవంతమైన వాదనను వినిపించాలి. విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాతి నుంచే టెట్‌ను అమలు చేయాలి. అంతకు ముందున్న వారికి మినహాయింపు ఉండేలా చూడాలి. టెట్ సిలబస్‌ను మార్చి ఉత్తీర్ణత మార్కుల శాతాన్ని కూడా తగ్గించి, కులాల వారీగా కాకుండా అందరికి ఒకేలా ఉండేలా చూడాలి. ఎన్‌సీటీఈ నోటిఫికేషన్‌ను సవరించి 2010 కన్నా ముందున్న వారిని మినహాయించాలి.

పెన్షనర్ల ర్యాలీ

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు అందించాల్సిన బెనిఫిట్లను ఇవ్వకపోవడంతో ఆత్మనిబ్బరం కోల్పోయి మరణిస్తున్నారని పెన్షనర్లకు జీవించే హక్కును ప్రసాదించాలంటూ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు కళ్యాణం కృష్ణయ్య, తాళ్లూరి వేణు, మేదరమెట్ల సుబ్బయ్య, డీకే శర్మ డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు. ఇటీవల కాలంలో రిటైర్డ్ ఉద్యోగులు పెన్షనర్లకు ప్రభుత్వం అందించాల్సిన ఆర్థిక ప్రయోజనాలను ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 20 నెలలు కావస్తున్న మంజూరు చేయకపోవడంతో మానసికంగా కుంగిపోయి మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే ఆరుగురు రిటైర్డ్ ఉద్యోగులు మరణించారని అన్నారు. వారి మరణానికి సంతాపసూచకంగా కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట నివాళులర్పించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెన్షనర్ల బకాయిలను తక్షణమే చెల్లించి, రిటైర్డ్ ఉద్యోగుల జీవితాలను నిలబెట్టాలని కోరారు.



ఖమ్మంలో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్రాంత ఉద్యోగులు



సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కార్తీక సందడి

శివాలయాల్లో ప్రత్యేక పూజలు
అయ్యప్పస్వామి దీక్షలు స్వీకరించిన భక్తులు..
గోదావరిలో పుణ్య స్నానాలు, కార్తీక దీపాలను వదిలిన భక్తులు

భద్రాచలం / కొత్తగూడెం సాంస్కృతికం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం బుధవారం నుంచి ప్రారంభమైంది. ఈ క్రమంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం లోని గోదావరిలో వేకువ జాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి గోదావరి లో కార్తీక దీపాలను వదిలారు. అలాగే గోదావరి ఒడ్డున ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం, భద్రాద్రి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంతో పాటు ఇతర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సమయంలో కార్తీక దీపాలను సైతం వెలిగించారు. భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో రామాలయం అనుబంధ ఆలయమైన శివాలయంలో కార్తీకమాసం నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, అభిషేకాలు సైతం నిర్వహించనున్నారు.

కొత్తగూడెంలో..

పవిత్ర శుభప్రదమైన కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా బుధవారం కొత్తగూడెం లోని శివాలయాల్లో భక్తుల సందడి కన్పించింది. కొత్తగూడెంలోని ప్రగతినగర్ ఉమా మహేశ్వరాలయం, గణేష్ టెంపుల్, బూడిద గడ్డ, రుద్రంపూర్ శివాలయాలు, రైటర్‌బస్తీ త్రిమాతపంచాయతన క్షేత్రంతో పాటు ఇతర ఆలయాల్లో భక్తులు కార్తీక దీపారాధన చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షలు ప్రారంభం

కార్తీకమాసం ప్రారంభమవడం, అయ్యప్పకు ప్రీతికరంగా భావించే బుధవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు అయ్యప్పస్వామి మాలలు ధరించి మండల దీక్షలు స్వీకరించారు. జిల్లాలోనే ఎంతో ప్రాముఖ్యత కలిగిన కొత్తగూడెం రైటర్ బస్తీలోని 18మెట్ల శ్రీధర్మశాస్త్రాలయంలో సుమారు 200మందికి పైగా భక్తులు అయ్యప్ప దీక్షలు తీసుకున్నారు. అయ్యప్ప స్వామి మాలధారులతో ఆలయం కిక్కిరిసి పోయింది.



కొత్తగూడెం శ్రీధర్మశాస్త్రాలయంలో బారులుతీరిన అయ్యప్ప మాలధారులు



గోదావరిలో కార్తీక దీపాలు వదులుతున్న భక్తులు



పూజల్లో పాల్గొన్న భద్రాద్రి రామాలయం ఈవో దంపతులు

ఘనంగా కార్తీకమాసం పూజలు ప్రారంభం

ఖమ్మం నగరంలో 8 వేల మంది దీక్షలు స్వీకరించిన అయ్యప్ప భక్తులు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం బుధవారం ప్రాంభం కాగా మొదటిరోజు నగరంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకొని శివయ్యకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్తీకమాసం ప్రారంభం.. బుధవారం కావటంతో అయ్యప్పకు ఎంతో ఇష్టమైన రోజున ఖమ్మం నగరంలోని రెండు అయ్యప్పస్వామి ఆలయాలలో సుమారు 8వేల మంది దీక్షలు తీసుకున్నారు. శ్రీనివాసనగర్ అయ్యప్ప ఆలయంలో 6వేల మంది, బైపాస్‌రోడ్ అయ్యప్ప ఆలయంలో 3 వేల మంది దీక్షలు తీసుకున్నారు. అయ్యప్ప భక్తులతో, ఆలయాలు కిటకిటలాడాయి. స్వామియేశరణం అయ్యప్ప అంటూ నామ స్మరణతో ఆలయాలు దద్దరిల్లాయి. అయ్యప్ప భక్తులకు వారి కుటుంబ సభ్యులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



చిత్తశుద్ధి ఉంటే రాజీనామా చేసి..

బీసీ మంత్రిని పెట్టండి

బీజేపీని బెదిరిస్తే చూస్తూ ఊరుకోం..
దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి
స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చుక్కలు చూపిస్తాం
సత్తుపల్లిలో పర్యటించిన బీజేపీ నిజనిర్ధారణ కమిటీ సభ్యుడు
మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాంనాయక్



సత్తుపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాంనాయక్

సత్తుపల్లి/ఖమ్మంబైపాస్‌రోడ్ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాజీనామా చేయించి జిల్లాలో బీసీ మంత్రిని పెట్టాలని మాజీ పార్లమెంట్ సభ్యుడు ప్రొఫెసర్ ఏ.సీతారాంనాయక్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జీ.ఆనంద్‌గౌడ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆత్మకూరి కాంతికిరణ్‌లు ఆరోపించారు. బీసీ బంద్‌లో భాగంగా కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడిన బీజేపీ పట్టణాధ్యక్షుడు బాణోత్ విజయ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. సంఘటనకు సంబంధించిన పూర్వాపరాలను విచారించి నివేదికను తయారు చేశారు. అనంతరం జే కన్వెన్షన్ సెంటర్‌లో విలేకరులతో మాట్లాడుతూ గౌరవ ప్రథమైన పోస్టులో ఉన్నా.. పోలీసులు ఇక్కడి మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పినట్లుగా విని ఎస్సీఎస్టీల మనోభావాలను దెబ్బతీశారన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో బూత్‌స్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో ఉన్న నాయకులను గుర్తిస్తుందన్నారు. దాడి కేసు విషయంలో కాంప్రమైజ్ అవ్వాలని పోలీసులు చెప్పడం సరికాదని, బీజేపీని బెదిరిస్తే చూస్తూ ఊరుకోమని, కారకులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలు ఎదుగుతుంటే ఓర్వలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో 9మంది ఓసీ మంత్రులే ఉన్నారన్నారు.రాజకీయ లబ్ధిపొందాలనుకునే వారు బీసీలపై ఎస్సీలతో.. ఎస్సీలపై బీసీలతో కేసులు పెట్టిస్తారాని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, మీ పార్టీ కేవలం మూడు చోట్ల మాత్రమే అధికారంలో ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మాలాంటి ఉద్యమకారులను బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ తొక్కేస్తుందన్నారు. మొన్నటిదాకా కేసీఆర్‌పై కోపంతో కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారని, ఈ రెండేళ్లలోనే మొత్తం బట్టలు చించుకున్నాడని సీఎంను ఉద్దేశ్యించి అన్నారు. ఈసారి జరిగే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చుక్కలు చూపిస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో మేం ఎవరి జోలికీ పోమని, మా సామాజిక వర్గంతో పాటు బీజేపీ ఆక్రోషానికి గురికావద్దని, ఫాల్స్ కేసును వెంటనే విత్ డ్రా చేసుకోవాలని, సత్తుపల్లిలో బీజేపీ నాయకులపై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ.రమేష్, నంబూరి రామలింగేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వరరావు, నాయుడు రాఘవరావు, నున్నా రవికుమార్, విజయరాజు, బెనర్జీ చౌదరి, నాగ సురేందర్‌రెడ్డి, రామిశెట్టి నాగేశ్వరరావు, భాస్కర్ల వీరంరాజు పాల్గొన్నారు.

మా కార్యకర్తలపై దాడిచేస్తే సహించం

ఖమ్మంబైపాస్‌రోడ్: కాంగ్రెస్ నాయకులు బీజేపీని తక్కువ అంచనా వేస్తున్నారని పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడిచేస్తే సహించేది లేదని పార్టీ రాష్ట్రనాయకుడు మాజీ ఎంపీ సీతారాంనాయక్ అన్నారు. బుధవారం ఖమ్మంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల బీసీ బంద్‌లో భాగంగా సత్తుపల్లిలో బీజేపీ కార్యకర్తలపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్లో ప్రవేశానికి

ఎస్సీ విద్యార్థులకు అవకాశాలు

జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి



జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి శ్రీలత

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భద్రాచలం లిటిల్ ఫ్లవర్స్ స్కూల్లో షెడ్యూల్ కులాల విద్యార్థుల ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఏ.శ్రీలత ఓ ప్రకటనలో తెలిపారు. లిటిల్ ఫ్లవర్స్ బెస్ట్ అవైలబుల్ స్కూల్లో డ్రాప్స్ అవుట్స్ స్థానంలో కొత్త విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు శ్రీలత పేర్కొన్నారు. మొత్తం 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని వీటిలో 20 సీట్లు రెసిడెన్షియల్, మరో 20 సీట్లు నాన్ రెసిడెన్షియల్ ఖాళీలు నింపడం జరుగుతుందని తెలిపారు. మూడో తరగతి, రెండు, నాలుగవ తరగతిలో ఐదు, ఆరవ తరగతిలో 3 నాన్ రెసిడెన్షియల్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఏడో తరగతిలో 10 రెసిడెన్షియల్, మూడు నాన్ రెసిడెన్షియల్ సీట్లు, ఎనిమిదో తరగతిలో ఏడు రెసిడెన్షియల్,నాలుగు నాన్ రెసిడెన్షియల్ సీట్లు, తొమ్మిదవ తరగతిలో మూడు రెసిడెన్షియల్, మూడు నాన్ రెసిడెన్షియల్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ 40 సీట్లు లాటరీ పద్ధతిలో పూర్తి చేయనున్నారు. భద్రాద్రి జిల్లాలో ఉన్న విద్యార్థులకు మాత్రమే ఈ పాఠశాలలో ప్రవేశ అర్హత ఉంటుంది. విద్యార్థి తండ్రి సంవత్సర ఆదాయము గ్రామీణ ప్రాంతాల వారికైతే రూ.లక్ష 50 వేలు, పట్టణ ప్రాంతాల వారైతే సంవత్సర ఆదాయం రూ.రెండు లక్షలు మించి ఉండరాదని శ్రీలత తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తాము చదువుతున్న పాఠశాలల నుంచి బోనఫైడ్ సర్టిఫికేట్, సర్టిఫికేట్, కులం, ఆదాయం, నివాసం, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారాలను భద్రాచలం, పాల్వంచ సహాయ సంక్షేమ అధికారి కార్యాలయం నుంచిగాని, పాల్వంచ ఐడీవోసీలో ఉన్న జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో పొందవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమ దరఖాస్తులు నవంబర్ రెండవ తేదీలోగా పైన పేర్కొన్న కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. నవంబర్ 6వ తేదీన ఐడీవోసీ కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుంది. షెడ్యూల్ కులాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎస్సీ అభివృద్ధి అధికారి కోరారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

కూసుమంచి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింహులగూడెం ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు గుడిపుడి వీరయ్యపై సస్పెన్షన్ వేటుపడింది. ఈమేరకు డీఈవో శ్రీజ ఉత్తర్వులు జారీ చేశారు. వీరయ్య పాఠశాలలోని విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అతనిపై విద్యార్థులు ఈనెల 16న హెచ్‌ఎంకు ఫిర్యాదుచేశారు. దీంతో హెచ్‌ఎం శివకుమార్ కూసుమంచి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో కేసునమోదు చేసి రిమాండ్‌కు తలించారు. అనంతరం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈవో రామాచారి విద్యార్థులను, తల్లిదండ్రులను, సహ ఉపాధ్యాయులను విచారించి, నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. ఈ మేరకు విచారణ చేపట్టిన నివేదికను ఆధారంగా ఉపాధ్యాయుడు వీరయ్యను సస్పెండ్ చేస్తూ డీఈవో శ్రీజ బుధవారం ఉత్తర్వ్యులు జారీచేశారు. ఇదిలా ఉండగా వీరయ్యపై ఆరోపణలు రావడంతో తన పలుకుబడి ఉపయోగించి డిప్యుటేషన్‌పై ఖమ్మం అర్బన్ మండలానికి బదిలీపై వెళ్లారు.

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన డీఈవో

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండలం ఎర్రగడ్డ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ గతనెలలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల మంజూరు చేయాలంటూ ప్రజా సంఘాలు నిర్వహిస్తున్న ధర్నాలో పాల్గొన్నందుకు మెమో జారీ చేశారు. ఉపాధ్యాయుడు అందించిన వివరణ సరిగా లేదంటూ ఉపాధ్యాయుడు భూక్యా కేశ్యాను బుధవారం సస్పెండ్ చేస్తూ అదనపు కలెక్టర్, ఇంచార్జ్ డీఈవో డాక్టర్ పి.శ్రీజ ఉత్తర్వులు జారీచేశారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌ను రద్దు చేయాలి : యూటీఎఫ్ జిల్లా కమిటీ

ఐటీఐ కళాశాల మంజూరు కోసం ప్రజా సంఘాలు నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న కూసుమంచి మండలం ఎర్రగడ్డ పాఠశాల ఉపాధ్యాయుడు భూక్యా కేశ్యాను సస్పెండ్ చేస్తూ అదనపు కలెక్టర్ తీసుకున్న నిర్ణయం సరికాదని, వెంటనే ఉపాధ్యాయుడిపై సస్పెన్షను రద్దు చేయాలని యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావులు డిమాండ్ చేశారు. ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారం చేసుకోని సస్పెన్షన్ చేయాడాన్ని తీవ్రంగా ఖండించారు.

చైతన్యంతోనే గంజాయి నిర్మూలన

కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్
ప్రశాంతినగర్ పంచాయతీలో కార్డన్ సెర్చ్



ప్రశాంతినగర్ కాలనీలో కార్డన్ సెర్చ్‌లో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, పోలీస్ అధికారులు

చుంచుపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చైతన్యంతోనే గంజాయి నిర్మూలన సాధ్యమవుతుందని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. బుధవారం కొత్తగూడెం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల చుంచుపల్లి మండలం ప్రశాంతినగర్ గ్రామ పంచాయతీలో కార్డన్ సెర్చ్ నిర్వహించి అనుమానాస్పద ప్రాంతాలను, ఇండ్లలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 37బైకులు, రెండు ఆటోలు, ఒక కారు, రూ.46,190 విలువైన బీర్ బాటిళ్లు, 223 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. ఈ సందర్భంగా భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు ఆదేశానుసారం మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమం డివిజన్ పరిధిలో చైతన్యం అనే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రశాంతినగర్ పంచాయతీలో కొత్తవారు, ఇతరులు ఎవరైన వస్తే వారిపై నిఘా పెట్టాలని స్థానికులకు సూచించారు. వారి ప్రవర్తనపై అనుమానాలు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గంజాయిని సేవించడం, సరఫరా చేయడం, ప్రోత్సహించడం, నిల్వం ఉంచడం చట్టప్రకారం నేరమని హెచ్చరించారు. పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు మెలగాలని వారికి అవగాహన కల్పించేలా మాట్లాడాలని సూచించారు. ఈ క్రమంలో నలుగురిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు. అదనంగా 30 ఈ-చలాన్లు బుక్ చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, కరుణాకర్, వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి రఘు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయితో పోలీసులు

ఖమ్మం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రెండు కేజీల గంజాయిని బుధవారం ఖమ్మం రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన ఖమ్మం రూరల్ మండలం కస్నాతండా ప్రాంతంలో చోటుచేసుకుంది. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కస్నాతండా గ్రామానికి చెందిన వాంకుడోతు వినోద్, రంగారెడ్డి జిల్లా కొత్తపేటకు చెందిన వస్కుల రాజు, హైదరాబాద్ ఎల్బీనగర్‌కు చెందిన గొడ్డెమల్ల సాయిరాం, డోర్నకల్ మండలం మన్నెగూడెంకు చెందిన భూక్య రోహిత్‌లు కలిసి కస్నా తండా ప్రాంతంలో చెట్ల పొదల్లో మద్యం తాగుతున్నారు. అదే సమయంలో కస్నాతండా ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఈ నలుగురు మద్యం తాగుతూ, అనుమానాస్పదంగా ఉండడంతో గమనించిన పోలీసులు అక్కడకు చేరేలోపే... వారిని చూసి భూక్య రోహిత్ అక్కడినుంచి పారిపో యాడు. దీంతో పోలీసులు వారిని తనిఖీ చేయగా వారి వద్ద రెండు కేజీల గంజాయి దొరికింది. దీంతో వారిని అరెస్టు చేసి, 3 సెల్‌ఫోన్‌లను, రూ.లక్ష విలువచేసే గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు

పెరిగేలా కృషి చేయాలి

ఖమ్మం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చందు నాయక్



టీకా మందులను పరిశీలిస్తున్న చందునాయక్

బోనకల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు పెరిగేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని ఖమ్మం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చందునాయక్ కోరారు. స్థానిక పీహెచ్‌సీని బుధవారం ఆయన సందర్శించారు. ఈ మేరకు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణీల నమోదు, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా జిల్లా టీబీ అధికారి సుబ్బారావు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. టీబీ వ్యాధిగ్రస్తుల వివరాలు, వారికి అందిస్తున్న వైద్యసేవల గురించి వివరాలను సేకరించారు. మందుల పంపిణీని పరిశీలించారు. మెరుగైన వైద్య సేవలందించేలా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, కావ్య, దానయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు పెంచండి

జేవీఆర్, కిష్టారం ఓసీలను సందర్శించిన పర్యావరణ, అటవీశాఖల సభ్యులు



అధికారులకు సూచనలిస్తున్న పర్యావరణ, అటవీశాఖల సభ్యులు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి) : గనుల నిర్వహణలో భాగంగా కాలుష్య నివారణకు మొక్కలు నాటి వాటి పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలని పర్యావరణ, అటవీశాఖలకు చెందిన సభ్యులు ప్రొఫెసర్ ఆర్ఎం.భట్టాచార్య అన్నారు. బుధవారం సత్తుపల్లిలోని జేవీఆర్, కిష్టారం ఓసీలను పర్యావరణ, అటవీశాఖ సభ్యులు సందర్శించి పలు సూచనలు చేశారు. మొక్కల పెంపకంతో పాటు బొగ్గు దుమారం లేవకుండా నీళ్లను వెదజల్లడం అభినందనీయమన్నారు. అదేవిధంగా రానున్న రోజుల్లో కాలుష్యాన్ని నివారించి గని పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో జీఎంలు సైదులు, షాలెంరాజు, అధికారులు ఎన్‌వీఆర్.ప్రహ్లాద్, కోటిరెడ్డి, రాజేశ్వరరావు, కల్యాణ్‌రామ్, రవికిరణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాపికొండల పర్యాటకం

తెలంగాణ వైపు నుంచి వచ్చే పర్యాటకులకు మార్గం సుగమం
అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన పీవో శుభమ్ నోక్వాల్



పాపికొండలకు బయలుదేరే పోచవరం ఫెర్రీ పాయింట్

భద్రాచలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వైపు నుంచి ఏపీ లోని పాపికొండలు, పేరంటాలపల్లి పర్యాటక ప్రాంతాన్ని సందర్శించడానికి వచ్చే పర్యాటకులకు మార్గం సుగమయ్యింది. అల్లూరి జిల్లా వరరామచంద్రాపురం మండలం పోచవరం ఫెర్రీ పాయింట్ నుంచి బోట్లు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు చింతూరు సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీవో, ఇన్‌చార్జి శుభమ్ నోక్వాల్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బోటు యజమానులు బుధవారం పాపికొండలు పర్యాటకాన్ని అధికారికంగా ప్రారంభిస్తున్న క్రమంలో సమావేశమై చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. దసరా పండుగ నాటికి పాపికొండలు పర్యాటకం ప్రారంభం కావాల్సి ఉండగా ఈసారి అధిక వర్షాలతో తరచూ వరదలతో పాపికొండల పర్యాటకం ప్రారంభించేందుకు అధికారుల నుంచి అనుమతి లభించలేదు. ఎట్టకేలకు అనుమతులు లభించడంతో ఇక నుంచి తెలంగాణ వైపు పర్యాటకులు పోచవరం నుంచి పాపికొండల పర్యాటకంకు వెళ్లేందుకు మార్గం సుగమం అయ్యింది. ఈ పర్యటన సమయంలో పెద్దలకు రూ.950, పిల్లలకు రూ.750 టికెట్ ధర గతంలో లాగే కొనసాగించనున్నామని బోటు యజమానులు తెలిపారు. పర్యాటకులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనంతో పాటు స్నాక్స్, టీ అందజేయనున్నట్లు వెల్లడించారు.

అటవీ ప్రాంతాల్లో చెట్లను నరికితే ఉపేక్షించం

మొక్కల నరికివేతలో సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు తేలితే శాఖాపరమైన చర్యలు : కొత్తగూడెం ఎఫ్‌డీవో కోటేశ్వరరావు



సిబ్బంది నుంచి సమాచారం తెలుసుకుంటున్న ఎఫ్‌డీవో కోటేశ్వరరావు

జూలూరుపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల్లోకి అక్రమంగా ప్రవేశించి చెట్లు నరికినట్లైతే ఉపేక్షించబోమని, అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కొత్తగూడెం ఎఫ్‌డీవో యు.కోటేశ్వరరావు అన్నారు. జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని గుండెపుడి బీట్‌లో అటవీ ప్రాంతంలో అనంతారం గ్రామానికి చెందిన ఈసం వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ప్లాంటేషన్‌లోకి ప్రవేశించి జామాయిల్ మొక్కలను నరికివేసిన స్థలాన్ని బుధవారం ఎఫ్‌డీవో సందర్శించారు. నరికిన మొక్కలకు సంబంధించిన జామాయిల్ మొట్లను ఆయన పరిశీలించారు. సిబ్బంది నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాంటేషన్‌లోకి ప్రవేశించి జామాయిల్ మొక్కలు నరికిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జామాయిల్ మొక్కలను నరికివేసిన సంఘటనలో అటవీ సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అటవీ సిబ్బంది పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి ప్లాంటేషన్‌లోకి ఎవరూ ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ డీఆర్వో సలోజ, జూలూరుపాడు ఎఫ్ఆర్వో ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు భద్రాద్రి జిల్లా స్థాయి జాబ్ మేళా

జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్

చుంచుపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా స్థాయి జాబ్‌మేళాను శుక్రవారం పాల్వంచలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదారాబాద్ వారి జేవీజీ మేనేజ్‌మెంట్ వారి మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కంపెనీలో టెక్నీషియన్స్, ట్రైనీ టెక్నీషియన్స్ భర్తీకి 200పోస్టులకు గాను నిరుద్యోగ మహిళా, పురుష అభ్యర్థుల నుంచి భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థి వయస్సు 19నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలని, ఎంపికైన వారు హైదారాబాద్ ప్రాంతంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వీరి విద్యార్హత పదో తరగతి నుంచి డిగ్రీ లేదా ఐటీఐ పూర్తిచేసిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. కావున ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలకల్లా ఇంటర్వ్యూకు ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9010584000 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

మధిర రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం సిరిపురం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఏపీలోని గుంటూరుకు చెందిన సాంబశివరావు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై బోనకల్ నుంచి మధిర వైపు వస్తుండగా మార్గమధ్యలో సిరిపురం వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్రగాయాలు కావడంతో మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



బస్సుపై రాళ్లు వేసేందుకు యత్నం

ఖమ్మంక్రైం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): బస్సుపై భార్యభర్తలు రాళ్లు వేసేందుకు ప్రయత్నించారంటూ ఖానాపురంహవేలి పోలీసుస్టేషన్‌లో ఖమ్మండిపోబస్సు డ్రైవర్ మధు,కండక్టర్ ఆదిలక్ష్మి బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులుకథనం ప్రకారం.. ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మణుగూరు నుంచి ఖమ్మం వస్తోంది. ఈ నేపథ్యంలో ఖమ్మం నగర శివారు ప్రాంతం గోపాలపురం వద్దకు రాగానే ఓద్విచక్రవాహనం దగ్గరగా వచ్చిందని, ఈ వాహనంపై ఉన్న భార్యభర్తలు డ్రైవర్, కండక్టర్‌పై గొడవకు దిగారు. రాళ్లు వేసేందుకు యత్నించారు. ఈనేపథ్యంలో డ్రైవర్ ఖానాపురంహవేలి పోలీసుస్టేషన్ వద్ద బస్సును ఆపి పోలీసులకు బస్సుపై రాళ్లు వేసేందుకు ప్రయత్నించారంటూ ఫిర్యాదు చేశారు. సదరు భార్యభర్తలు కూడా ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లపై ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఖమ్మంరూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం మండల కార్యదర్శి ప్రతాపనేని వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మంగళగూడెం, పోలిశెట్టిగూడెం గ్రామాల్లో దెబ్బతిన్న పత్తిపంటలను రైతుసంఘం, సీపీఎం నాయకులు బుధవారం పరిశీలించారు. రైతులను ఆదుకోవాలన్నారు.

పఠనా సామర్థ్యం పెంపునకు 'ఎవ్రీ చైల్డ్ రీడ్స్'

- నెల పాటు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అమలు
- రోజూ గంట సమయం కేటాయించాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): ప్రతీవిద్యార్థికి చదివే సామర్థ్యం కల్పించాలనే లక్ష్యంలో ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అమలు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. భక్తరామదాసు కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన ఎవ్రీచైల్డ్‌రీడ్స్ అవగాహన కార్యక్రమంలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విద్యార్థులకు ముందుగా చదవడం, చదివింది అర్థం చేసుకోవడం అనే నైపుణ్యాలు రావడం చాలా కీలకమని అన్నారు. ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమ పర్యవేక్షణకు యాప్ తయారు చేశామని, ప్రతీ బుధవారం విద్యార్థి రీడింగ్ స్కిల్స్ ఏస్థాయిలో ఉన్నాయో(అక్షరాలు, పదాలు,వాక్యాలు) అప్‌డేట్ చేయాలని అన్నారు. వచ్చే సోమవారం నుంచి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం ప్రారంభం కావాలని అన్నారు. బుధవారం విద్యార్థుల చదివే సామర్థ్యాలను యధావిధిగా యాప్ లో నమోదు చేయాలని, తప్పుడు వివరాలు ఎట్టి పరిస్థితుల్లో నమోదు చేయవద్దని అన్నారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ చింతకాని మండలంలో కొన్ని పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం తీసుకుని మంచి ఫలితాలు సాధించామన్నారు. ఎవ్రీ చైల్డ్ రీడ్స్ సమర్థవంతంగా అమలు చేసేందుకు పాఠశాలలో 20 మంది పిల్లలను ఒక టీచర్ పర్యవేక్షించేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సీ.హెచ్. రామకృష్ణ, సీఎంఓ ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు,ఎంఈవోలు, సంబంధిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఉద్యోగుల లెక్క పక్కా

- జిల్లా వ్యాప్తంగా వివరాల సేకరణ
- నవంబరు నుంచి సకాలంలో వేతనాలు

ఖమ్మంకార్పొరేషన్,అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థతో పాటుగా జిల్లాలోని ఇతర మునిసిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల డేటాను అధికారులు సేకరించారు. ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు. నగరపాలక సంస్థలు, మునిపాలిటీల్లో రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను సీడీఎంఏ అధికారుల ఆదేశాల మేరకు రెండురోజులుగా ఐఎఫ్ఎంఎస్(ఇంటిగ్రేటెడ్‌ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్‌సిస్టమ్)లో ఆన్‌లైన్ జరుగుతుంది. గతంలో మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన సంపూర్ణ సమాచారం అందుబాటులో లేదు. ఉద్యోగి పూర్తి పేరు విద్యాభ్యాసం జరిగింది. ఉద్యోగంఎలా వచ్చింది. ఏ క్యాడర్‌లో ఉన్నారో వివరాలను నమోదు చేస్తున్నారు. భవిష్యత్‌లో ఉద్యోగి ఐడీనెంబర్ పరిశీలించటం ద్వారా పూర్తి సమాచారం కనిపించేలా సీడీఎంఏ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఖమ్మంనగర పాలక సంస్థలో పనిచేస్తున్న 224మందిరెగ్యులర్, 1,010 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నమోదు తుదిదశకు చేరుకుంది. ఇతర మునిసిపాలిటీల్లోను వేగవంతంగా జరుగుతుంది.

సకాలంలో వేతనాలు

రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇక సకాలంలో వేతనాలు అందించే అవకాశం ఉందని సమాచారం. ఈమేరకు 15రోజుల క్రితమే సీడీఎంఏ నుంచి నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలకు సర్క్యులర్ జారీ జరిగింది. ఉద్యోగుల ఖచ్చితమైన వివరాలను నమోదు చేయటం ద్వారా నవంబరు నుంచి సకాలంలో వేతనాలు అందించనున్నారు.



శోభాయాత్రలో మహిళల కోలాటం

శోభాయమానంగా గిరి ప్రదక్షిణ

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి (గుట్ట) గిరి ప్రదక్షిణ బుధవారం శోభాయమానంగా జరిగింది. ఆలయ అర్చక బృందం, దేవాదాయశాఖ అధికారులు, భక్త బృందాల ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేక పల్లకీలో గిరి ప్రదక్షిణలో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరహరి నర్సింహాచార్యులు, రామకృష్ణాచార్యులు, శ్రీనివాసచార్యులు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కొత్తూరు జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు. ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు రాకుండ పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. లోక కల్యాణార్థం ప్రతీ నెల స్వామి వారి జన్మనక్షత్రం రోజన స్తంభాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో, అర్చక బృందం తెలిపింది. ఈ ప్రదక్షణ సాయంత్రం ఐదుగంటలకు ప్రారంభమై రాత్రి8 గంటల వరకు నిర్వహించారు. స్వామి కొండ చుట్టూ జయకేతనాలతో నరసింహాస్వామి నామకీర్తనల నడుమ భక్తిభావంతో భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. గిరిప్రదక్షిణ సుమారు రెండు కిలోమీటర్ల వరకు ఉండటంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండ మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించారు. ఆలయం నుంచి గిరిప్రదక్షణ ప్రారంభమై గుట్ట చుట్టూ తిరుగుతూ గుట్టపైకి చేరారు. ప్రదక్షిణ అనంతరం కొండపై ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన స్వాతి నక్షత్రజ్యోతిని వెలిగించారు. భక్తులు దివ్యజ్యోతి దర్శనం చేసుకున్నారు.



పల్లకీలో స్వామివారు..



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

పరిశుభ్ర నగరంగా ఖ్యాతి పొందాలి: మేయర్

- మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని రాష్ట్రంలోనే పరిశుభ్రమైన నగరంగా ఖ్యాతి పొందేలా పారిశుధ్య పనులు చేపట్టాలని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం వైరా ప్రధాన రహదారి డ్రెయినేజీ పూడికతీత,పారిశుధ్య పనులను మేయర్ పరిశీలించారు.ప్లాస్టిక్ నియంత్రణ చేపట్టటం ద్వారా డ్రెయినేజీల్లో వ్యర్థాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మురుగు నీరునిల్వఉండా చెత్త, మట్టిని ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ప్రధాన రహదారులు, కూడళ్లలు,డివైడర్లు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానకమర్షియల్ ప్రాంతాల్లో వ్యాపారులకు అవగాహన కల్పించాలని సూచించారు. 45వ డివిజన్ కార్పొరేటర్ బుడిగం శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మేయర్

ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన మేయర్

ఎస్ఎస్‌పీ క్యాంపులోని ఓపెన్ జిమ్‌ను మేయర్ నీరజ స్థానిక కార్పొరేటర్ బుర్రి వెంకట్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ప్రజల శారీరక, మానసిక ప్రశాంతతకు నగరంలోని 60 డివిజన్‌ల్లో పార్కులు, ఓపెన్ జిమ్‌లను ప్రారంబిస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధిక పాల్గొన్నారు.

పాఠశాలల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోపెండింగ్‌లోఉన్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల పురోగతిపై బుధవారం అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 44ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులు పెండింగ్ ఉన్నాయన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసి ఎంబీ రికార్డులు వివరాలు నమోదు చేస్తే తక్షణమే బిల్లులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. 44 పాఠశాలల్లో పనుల పురోగతి వివరాలను పాఠశాలల వారిగా సమీక్షించి పలు సూచనలు చేశారు. అక్టోబరు నెలాఖరు వరకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పాఠశాలకు నీరు సరఫరా లేని పక్షంలో సమీపంలో మిషన్ భగీరథ పైప్ లైన్ నుంచి కనెక్షన్ అందించాలన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్.రామకృష్ణ, ఎంపీడీఓలు, ఎంఈఓలు, సంబంధిత పాఠశాలల హెడ్‌మాస్టర్లు,ఏఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు

రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధికి పకడ్బంది కార్యాచరణ చేపట్టాలని రాష్ట్రవిద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అన్నారు. విద్యాశాఖ కార్యదర్శి, విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్‌తో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మధిర నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సమీక్షలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానికసంస్థల అదనపు కలెక్టర్, జిల్లావిద్యాశాఖ అధికారి శ్రీజతో కలిసి క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ,మధిర నియోజకవర్గ పరిధిలోని పాఠశాలపై నివేదిక వెంటనే సిద్ధం చేసి అందించాలన్నారు.

26న క్యాన్సర్ ఉచిత వైద్యశిబిరం

భక్తరామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి వెంకటరామారావు

నేలకొండపల్లి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): భక్తరామదాసు సర్వీస్ సొసైటీ, నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ఈనెల 26 ఆదివారం నేలకొండపల్లి రావెళ్ల భవన్‌లో నిర్వహించనున్నట్లు భక్తరామదాసు సర్వీస్‌సొసైటీఅధ్యక్షుడు ఏటుకూరి వెంకట రామారావు కోరారు. బుధవారం నేలకొండపల్లిలోని రావెళ్ళ భవన్‌లో భక్తరామదాసు సర్వీస్ సొసైటీ, ఎన్టీఆర్ ఫౌండేషన్‌లు సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేంలో ఈవివరాలు వెల్లడించారు. యువత, మహిళల్లో కాన్సర్ వ్యాధి లక్షణాలు ఎక్కువగా కనపడుతున్నాయన్నారు. వైద్యఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్న నేటి రోజుల్లో పేదలను ఆదుకోవటానికి కాన్సర్ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం నేలకొండపల్లి రావెళ్ళభవన్‌లో నిర్వహించనున్న ఈవైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏటుకూరి కోరారు. కార్యక్రమంలో గెల్లా వెంకటరమణగుప్తా, ఓరుగంటి నారాయణరావు, గెల్లా జగన్మోహన్‌రావు, పాలడుగు పూర్ణచంద్రప్రసాద్, తెల్లగొర్ల లింగస్వామి, నంచర్ల దేవీప్రసాద్, ఎన్టీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఏటుకూరి రామారావు, కార్యదర్శి కేవిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

మున్నేరు కరకట్ట నిర్మాణం పూర్తి చేయాలి

ఖమ్మంఅర్బన్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మున్నేరు కరకట్ట నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని సీపీఎం ఖమ్మండివిజన్ నాయకులు షేక్ హిమాం అన్నారు. త్రీటౌన్‌లోని బొక్కలగడ్డ ఏరియాలో జరిగిన సీపీఎం 47వ డివిజన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నేరు కరకట్ట నిర్మాణం పూర్తికాక పోవటంతో పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, మంచికంటి నగర్, బొక్కలగడ్డ ప్రాంతాల ప్రజలు వర్షం కురిసిన ప్రతీసారి వరద ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను స్థానిక పేదలకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెంచిన పింఛన్లను వెంటనే అందించాలన్నారు. సమావేశంలో సీపీఎం త్రీటౌన్ నాయకులు షేక్ ఖాసిం, షేక్ జానీ, షేక్ పాషా, లింగాల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మకు ప్రముఖుల ఘన నివాళి

నేలకొండపల్లి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కట్టుకాచవరానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీసర్పంచ్ కోటి శ్రీనివాసరావు మాతృమూర్తి లక్ష్మమ్మకు పలువురు ప్రముఖులు ఘన నివాళులర్పించారు. బుధవారం గ్రామంలోని ఆయన స్వగృహంలో ఆమె దశదిన ఖర్మ నిర్వహించారు. శ్రీనివాసరావు తల్లి కోటి లక్ష్మమ్మ అనారోగ్యంతో ఈనెల 10న మృతి చెందారు. మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి మృతురాలి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. మృతురాలి కుమారుడు శ్రీనివాసరావును పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఆరెకట్ల కొండలరావు, సూరపనేని రామకృష్ణ, గడిపూడి వెంకటేశ్వరరావు, బండారు రాంబాబు, కాంగ్రెస్ నాయకులు కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, శాఖమూరి రమేష్, చిట్టూరి లక్ష్మీనారాయణ, ఏటుకూరి చిన్నపుల్లయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, నాయకులు శ్రీనివాసరావు, నంబూరి సత్యనారాయణ, అనగాని నర్సింహారావు, షేక్.హుస్సేన్, సీపీఎం జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు, భక్తరామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి వెంకటరామారావు, మాజీఅధ్యక్షుడు గెల్లా జగన్మోహన్‌రావు తదితరులు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.



నివాళులర్పిస్తున్న సండ్ర, సంబాని, కందాళ

ధ్యాన మందిరంపై నిర్లక్ష్యం

- ప్రారంభించిన ఏడాదికే పాడుబడుతున్న వైనం
- నేలకొండపల్లిలో నిర్వాహణ లేక చెత్త,చెదారంతో కళావిహీనం





భక్తరామదాస ధ్యానమందిరం ఆడిటోరియం, పగిలిన డూమ్ లైట్లు

నేలకొండపల్లి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని భక్తరామదాస ధ్యాన మందిరం నిర్వాహణలేక పాడుబడుతోంది. ఈ ఆడిటోరియాన్ని దాదాపుగా రూ.3కోట్లతో నిర్మించారు. 14 నెలలు కూడా నిండకుండానే చెత్తాచెదారంతో దర్శనమిస్తోంది. తుమ్మల నాగేశ్వరరావు కేసీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా ఉన్న సమయంలో నేలకొండపల్లిలోని భక్తరామదాసు ధ్యాన మందిరం అభివృద్ధిపై దృష్టి సారించారు. రూ.3కోట్లను మంజూరు చేయించారు. దీంతో పనులు చేశారు. దాదాపు 6 సంవత్సరాల అనంతరం 21ఆగస్టు 2024న పాలేరు శాసనసభ్యుడు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. దీంతో ఆడిటోరియంలేని కొరత తీరిందని నేలకొండపల్లి వాసులు ఆనందపడ్డారు. కానీ అది ఎంతోకాలం నిలవలేదు.ఆడిటోరియాన్ని పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ఆడిటోరియం చుట్టూ ప్రహరీ లేకపోవటం సైతం పెద్ద సమస్యగా మారింది. ఆడిటోరియం ఇంకా ఆర్‌అండ్‌బీ కంట్రోల్‌లోనే ఉన్నట్లుగా తెలుస్తున్నది. ఆడిటోరియం ఆవరణ ఎన్నో అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆడిటోరియం ఆవరణ గడ్డితో నిండిపోయి ఉంది. పూర్తి అపరిశుభ్రంగా ఉంది. మొత్తంగా మురికికూపానికి కేరాఫ్‌గా మారింది. రెండు రోజుల కితం చెత్తనుకోసినా,కుప్పలను తొలగించలేదు. మెట్లు, ఆవరణ అపరిశుభ్రంగా ఉంది.ఆడిటోరియం ముందు ఏర్పాటు చేసిన డూమ్ లైట్లు పగిలిపోయాయి. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండి చెత్తతో నిండి ఉండటంతో పాములు తిరుగుతూ చుట్టు పక్కల నివాస ప్రాంతాల్లోకి వస్తున్నాయని, దీంతో భయభ్రాంతులకు గురవుతున్నట్లు చుట్టు పక్కలవారు చెప్తున్నారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భక్తరామదాస ధ్యానమందిరంపై దృష్టి సారించాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

ఘనంగా తిరునక్షత్ర మహోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): రామానుజ చిన్నజీయర్ స్వామి వారి 69వ తిరునక్షత్ర మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జడ్పీ సెంటర్ పోలస్‌లోని వికాస తరంగిణి ఖమ్మం వారి ఆధ్వర్యంలో మహాఅన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస తరంగిణీ జిల్లా అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు మాట్లాడుతూ అనాథాశ్రమాలకు సరుకులు, సామగ్రి పంపిణీ చేశామన్నారు. సుమారుగా 700 మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. రామానుజ చిన్న జీయర్ స్వామి వారు సమాజం కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పేదలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందించడం,అందవిద్యార్థులకు చదువు చెప్పించడం, అల్లంపల్లి ప్రాంతంలో ట్రైబల్స్ పిల్లల కోసం స్కూల్లు, కాలేజీలు కట్టించి ఉచిత విద్య వసతులు ఏర్పాటు చేశారన్నారు. వేదపాఠశాలలు, ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్యం అందించడం వంటి కార్యక్రమాలను స్వచ్ఛందంగా చేస్తున్నరన్నారు. పుట్టినరోజు వేడుకల్లో భాగంగా నగరంలో నగర సంకీర్తన (శోభాయాత్ర) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోట్ల మాధవరావు, సిరం కృష్ణప్రసాద్, పారేపల్లి లక్ష్మీనారాయణ, అరవపల్లి మల్లికార్జున, ఉషా కన్య, రాధా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

'జెన్‌ట్రీ'కి ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఐటీ రంగ సంస్థ జెన్‌ట్రీ లాబ్స్‌కు ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైటనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ బుధవారం తెలిపారు. ఈనెలలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో వారు ఎంపిక కాగా బుధవారం ఆఫర్ లెటర్స్ అందుకున్నారు. వీరిని ఛైర్మన్ అభినందించారు. శిక్షణ అనంతరం రూ.2.2 నుంచి 3.6 లక్షలు వార్షిక ఆదాయంగా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్ జెన్‌ట్రీల్యాబ్స్ హెచ్‌ఆర్. పి.నరేంద్ర, కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

కడవరకు కమ్యూనిస్టుగానే కాసియా నాయక్

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

ఖమ్మంరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తను నమ్ముకున్న సిద్ధాంతానికి అనుగుణంగానే కాసియా నాయక్ కడవరకు కమ్యూనిస్టుగానే కొనసాగారని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. పెద్దతండాలోని 5వ డివిజన్లో కాసియా నాయక్ 10వ వర్ధంతి బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర నాయకులు మౌలానా, వెంకటరెడ్డి, సురేందర్, హుస్సైన్, హుసేన్, హస్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కుమరం భీం విగ్రహావిష్కరణ



ఖమ్మంచర్చికాంపౌండ్,అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటుచేసిన కొమరంభీం విగ్రహాన్ని జేఏసీ ఛైర్మన్, 9తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో జడ్పీసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి లకారం ట్యాంక్‌బండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జేఏసీ ఛైర్మన్, 9తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్టీజాబితా నుంచి లంబాడీలను తొలిగించాలన్నారు.

టీడీపీ నేత శ్యాంసుందర్‌కు నివాళి

తిరుమలాయపాలెం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి):టీడీపీ మండల నాయకులు తిరుమలాయపాలేనికి చెందిన కొండబాల వెంకట శ్యాంసుందర్‌కు వివిధ పార్టీల నేతలు నివాళులర్పించారు. ఆయన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం దశదిన ఖర్మ నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, వనమా వాసు, టీడీపీ జిల్లానాయకులు కొండబాల కరుణాకర్ నివాళులర్పించారు.

పత్తిరైతులు 'కపాస్ కిసాన్' యాప్ ఉపయోగించుకోవాలి

ఖమ్మంఅర్బన్అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): పత్తిరైతులు కపాస్ కిసాన్ యాప్ ఉపయోగించుకోవాలని రఘునాథపాలెం మండల వ్యవసాయాధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి సూచించారు. కపాస్ కిసాన్ యాప్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఆయన మండలపరిధిలోని జింకల తండాలో రైతులకు అవగాహన కల్పించారు. మొబైల్ యాప్ ద్వారా పత్తి ఎలా విక్రయించాలో తెలిపారు. యాప్‌లో సూచించిన సలహాలు, సూచనలు నిబంధనలు పాటిస్తే పత్తిరైతులు సమీప మార్కెట్లలో పత్తి పంటను సులువుగా మద్దతు ధరలకు విక్రయించుకోవచ్చన్నారు. క్వింటాపత్తికి రూ.8110 ధర పొందగోరే రైతులు పత్తిలో తేమశాతం 8 నుంచి 12లోపు ఉండేలా చూసుకోవాలన్నారు. యంత్రలక్ష్మి పథకంలో సన్న చిన్నకారు రైతులకు 50శాతంసబ్సిడీతో లభించే పరికరాలను వివరించారు. 40శాతం సబ్సిడీతో బ్యాటరీ స్పేయర్లు,తైవాన్ స్ప్రేయర్లు, బుష్ కట్టర్లు పవర్ టిల్లర్లు, రోటోవేటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు.



యాప్ గురించి అవగాహన కల్పిస్తున్న ఏవో

కార్తీకమాస పూజలు ప్రారంభం



బుగ్గపాడు శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసం ప్రారంభమైన సందర్భంగా బుధవారం సత్తుపల్లి పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా శివాలయాలతో పాటు పలు ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాల ప్రాంగణాలలో ఉదయం, సాయంత్రం వేళల్లో కార్తీక దీపాలు వెలిగించి ఉసిరి చెట్టుకింద పూజలు చేశారు. అదేవిధంగా పార్వతి పరమేశ్వరులకు అభిషేకాలు, కుంకుమపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఒక్కరి రక్తదానం ముగ్గురికి జీవితాన్ని ఇస్తుంది: కమాండెంట్



గంగారంలో రక్తదానం చేస్తున్న బెటాలియన్ అధికారి

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి, శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి రక్తదానం మరో జీవితాన్ని ఇస్తుందని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెదబాబు అన్నారు. పోలీస్ ఫ్లాగ్ డే-2025 దినోత్సవాలలో భాగంగా మండలంలోని గంగారం బెటాలియన్‌లో సిబ్బంది, అధికారులు పాల్గొని రక్తదానం చేశారు. అన్నిదానాల్లోకెల్లా రక్తదానం చాలా గొప్పదని, ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ ఏ.అంజయ్య, గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.అవినాష్, డాక్టర్ ఆకాష్, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెబ్బవరం-గన్నవరం రోడ్డుకు మహర్దశ

» రూ.20 కోట్లతో అభివృద్ధి
» హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



అధ్వానంగా ఉన్న సింగిల్ లైన్ రోడ్డు



కుడికాల్వపై శిథిలావస్థలో ఉన్న కల్వర్టు

వైరా, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వైరా-నెమలి రూట్లోని రెబ్బవరం-గన్నవరం ఆర్ అండ్‌బీ రోడ్డుకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనల మేరకు ఈ రోడ్డు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సీఆర్ఎఫ్ ద్వారా రూ.20కోట్ల నిధులను కొన్నిరోజుల కిందట మంజూరు చేసింది. ఈ విషయాన్ని ఆదివారం వైరా వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ధ్రువీకరిస్తూ ఈ ప్రకటన చేశారు. వైరా నుంచి మధిర-జగ్గయ్యపేట వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులోని రెబ్బవరం, గన్నవరం మీదుగా నెమలికి 20కిలోమీటర్ల దూరం ఉంది. అయితే రెబ్బవరం, కొండకొడిమ క్రాస్‌రోడ్డు, ఖానాపురం, గన్నవరం మీదుగా ఎన్టీఆర్ జిల్లా నెమలి సమీపంలోని వైరా మండల సరిహద్దు వరకు 9.2కిలోమీటర్ల దూరం ప్రస్తుతం సింగిల్ రోడ్డుగా ఉంది. ఖానాపురం-గన్నవరం మధ్య రోడ్డు మొత్తం కుంగిపోయి అధ్వానంగా ఉంది. ఈ 9.2కిలోమీటర్ల సింగిల్‌రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఇదే మండలానికి చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు. ఆ మేరకు కొన్నిరోజుల కిందట రూ.20కోట్ల నిధులను కేంద్రప్రభుత్వం మంజూరు చేసింది. దాంతో రెబ్బవరం నుంచి గన్నవరం సమీపంలోని ఏపీ సరిహద్దు వరకు 9.2కిలోమీటర్ల సింగిల్ రోడ్డును డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు మార్గం సుగమం అయింది. ఆర్అండ్‌బీ వైరా డీఈ రమేష్ పర్యవేక్షణలో డబుల్ రోడ్డు ఖానాపురం, గన్నవరంలలో అవసరమైన చోట్ల కల్వర్టులు, డ్రెయినేజీ నిర్మాణాల కోసం పూర్తిస్థాయిలో ఎస్టిమేట్లు వేస్తున్నారు. ఈ రోడ్డు అభివృద్ధితో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్లి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండనుంది.

నిధుల మంజూరు పట్ల హర్షం

శీలం వెంకటనర్సిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు



రెబ్బవరం-గన్నవరం రోడ్డు అభివృద్ధికి రూ.20కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల గన్నవరం గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాల నుంచి అధ్వానంగా ఉన్న సింగిల్ రోడ్డు అభివృద్ధికి నిధుల మంజూరు కోసం చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఈ నిధుల మంజూరుకు కృషిచేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అవగాహనతో క్షయవ్యాధిని నివారించొచ్చు

ఎర్రుపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై సామాజిక అవగాహన లేనందువల్లనే రోజురోజుకు టీబీ కేసులు పెరుగుతున్నాయని వ్యాధి నివారణ పై అవగాహన కలిగిస్తే క్షయవ్యాధిని అరికట్టవచ్చని జిల్లాటీబీ నివారణ అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు అన్నారు. మండలంలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా టీబీ కేసుల నమోదు, వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న వైద్యంపరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధిని ప్రాథమిక దశలోగమనించి చికిత్స పొందితే త్వరగా నయమవుతుందన్నారు. టీబీ వ్యాధి ఉన్న వ్యక్తి దగ్గినప్పుడు, మాట్లాడినప్పుడు, తుమ్మినప్పుడు టీబీ ఒకరినుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. అకారణంగా బరువు తగ్గడం, నిరంతరం దగ్గు, రాత్రిపూట చెమటలుపట్టడం, విపరీతమైన జ్వరం ఉంటే వైద్యుడిని సంప్రదించాలన్నారు. ఆరోగ్యక్రేంలో పరీక్షలు నిర్వహించుకునిఉచితంగా మందులు పొందాలన్నారు. ఆశాకార్యకర్తలు పోస్టర్ల ద్వారా గ్రామాల్లో ప్రజలకు వ్యాధిపై అవగాహన కలిపిచాలన్నారు. వైద్యాధికారి డాక్టర్‌ప్రశాంత్, డాక్టర్ అశ్విని, సీహెచ్‌వో కాంతమ్మ, సూపర్‌వైజర్‌సందీప్, వెంకటేశ్వరరావు, పార్మాసిస్ట్ అమృత్ పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజం కోసం పనిచేయాలి

మధిర రూరల్: టీబీ రహిత సమాజం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని క్షయ నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు సూచించారు. బుధవారం మధిర మండలం దెందుకూరు పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి పారా మెడికల్ సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు పృథ్వీనాయక్, దివ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



క్షయ నివారణ పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైద్యబృందం

నియోజకవర్గ అభివృద్ధిపై ఓఎస్‌డీ, మంత్రులకు ఎమ్మెల్యే వినతి



హైదరాబాద్‌లో ఓఎస్‌డీతో మాట్లాడుతున్న సత్తుపల్లి ఎమ్మెల్యే

సత్తుపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధిపై పలువురు ఓఎస్‌డీలతో పాటు రాష్ట్రమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి హైదరాబాద్‌లో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలపై వినతిపత్రాలు అందజేశారు. సత్తుపల్లి పట్టణంలోని నీలాద్రి అర్బన్‌పార్క్, 5మండల కేంద్రాలతోపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నూతన జిమ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ఆయా గ్రామాలలో నూతనంగా ఎస్సీ, ఎస్టీ నూతన కమ్యూనిటీ హాల్స్, ఖబరస్థాన్లను నిర్మించాలని ఎమ్మెల్యే కోరారు. సానుకూలంగా స్పందించిన వారి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

» అన్నవరం, పంచారామాలకు డీలక్స్ సర్వీసులు
» సత్తుపల్లి ఆర్టీసీ డీఎం ఊటుకూరి సునీత



సత్తుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న డీఎం సునీత

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం ప్రారంభమైన సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలకు భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు సత్తుపల్లి డిపోమేనేజర్ ఊటుకూరి సునీత అన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు స్థానిక పలు ఆలయాలలో ప్రచారం నిర్వహించారు. అన్నవరం, పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట, అరుణాచలం వరకు డీలక్స్ బస్సులు నడిపిస్తున్నట్లు చెప్పారు. ఆది, సోమవారాలు శైవక్షేత్రాలకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందుకు అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ముందస్తు ఆన్‌లైన్‌లో ఆర్టీసీ వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ తో పాటు ఇతర వివరాలకు 9866619189, 9550767375, 7382858470, 9505198590లను సంప్రదించాలని కోరారు.

ఏన్కూరు: కార్తీకమాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కొత్తగూడెం ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సులను నడపనుంది. కొత్తగూడెం, పాల్వంచ కేంద్రాల నుంచి ఏపీలోని అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పంచారామాలకు సూపర్ లగ్జరీ బస్సులను నడపనున్నారు. పూర్తి సమాచారం కోసం 9010374644 నెంబర్‌ను సంప్రదించాలని అధికారులు కోరారు.

దళారుల ప్రమేయం లేకుండా పత్తి విక్రయాలు

» సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, కోరం కనకయ్య



సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

కారేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తి విక్రయాల్లో ఎలాంటి దళారుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా సీసీఐ కేంద్రంలో ప్రభుత్వం రైతులకు అందించిన మద్దతు ధరకు పత్తి అమ్మకాలు జరుపుకోవాలని వైరా, ఇల్లందు ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్ నాయక్, కోరం కనకయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలోని అప్పాయిగూడెంలో గల శ్రీలక్ష్మీ ప్రియ కోటెక్స్ జిన్నింగ్ మిల్‌లో సెంట్రల్ కాటన్ కార్పొరేషన్ (సీసీఐ)ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని రైతులకు సరైనా మద్దతు ధర అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పత్తి, వరి దాన్యానికి మద్దతు ధర ప్రకటించడం జరిగిందన్నారు. ఏడీఏ కరుణశ్రీ, ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మన్ రాంబాబు, మార్కెట్ కమిటి కార్యదర్శి నరేష్‌కుమార్, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రావు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, వ్యవసాయశాఖ అధికారులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు.


తల్లాడ: సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని పత్తిరైతులు సద్వినియోగించుకోవాలని మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి అన్నారు. బుధవారం తల్లాడలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడ మట్టా దయానంద్ విజయ్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ రీజనల్‌జాయింట్ డైరెక్టర్ వి.శ్రీనివాసరావు, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి ఎంఏ అలీం, వైరా మార్కెట్ కమిటీచైర్మన్ బోళ్ల రంగారావు, వైస్‌చైర్మన్ కాపాసుధాకర్, సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ నాయకులు దగ్గులరఘుపతిరెడ్డి, జక్కంపుడి కిషోర్ , ఏవో ఎండీ తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పొలంలోకి వరద నీటి మళ్లింపు.. మహిళ ఆవేదన

చింతకాని, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నమండవ గ్రామానికి చెందిన పర్సగాని ఉమారాణి అనే మహిళా రైతుకు చిన్నమండవ నుంచి తిమ్మినేనిపాలెం రహదారిలో ఎకరం భూమి ఉంది. రోడ్డు నిర్మాణంలో భాగంగా మహిళా రైతు పొలం వద్ద కొందరు ఉద్దేశ్యపూర్వకంగా కల్వర్టు నిర్మించి వరద నీటిని మళ్లించాలని ప్రయత్నిస్తున్నారని తద్వారా తన పొలంలోని పంట నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వర్టు నిర్మాణం చేయొద్దని రోడ్డు పనుల వద్ద ఆమె మంగళవారం ఆందోళన నిర్వహించారు.

వైరా ఆత్మకమిటీ చైర్మన్‌గా మట్టూరి!

» అధికార ప్రకటనే తరువాయి
» సభ్యులుగా 25మంది పేర్లు సిఫారసు చేసిన ఎమ్మెల్యే



వైరా, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గ స్థాయి రైతుల సాంకేతిక సలహా కమిటీ(ఆత్మ)చైర్మన్‌గా మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మట్టూరి వెంకటేశ్వరరావు పేరు దాదాపు ఖరారైంది. ఈ పదవి కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచనలతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఏడీఏకు సిఫారసు చేశారు. ఏడీఏ నుంచి అధికారిక ఆదేశాలు రావడమే మిగిలి ఉంది. చైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ నాయకుడైన మట్టూరి వీరయ్య కుమారుడు వెంకటేశ్వరరావుతో పాటు సభ్యులుగా 25మంది పేర్లను సిఫారసు చేశారు. వారిలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన నాయకులు శీలం చంద్రశేఖర్, అల్లాడి నర్సింహారావు, మల్లెంపాటి చంద్రరావు, గుండ్ల జగన్నాథం, భూక్యా పద్మ, నున్నా రాజేశ్వరి, తంబళ్ల అమృతరావు, పాటి నర్సయ్య, అజ్మీరా బాలూనాయక్, ధనసరి సుమలత, వాసిరెడ్డి సత్యనారాయణ, గుగులోతు రమణ, పిట్టల గోవిందమ్మ, గోడ విజయ, తలారి విజయకుమారి, కాంపల్లి రాజ్యలక్ష్మీ, సున్నం పగడయ్య, మరీదు నాగేశ్వరరావు, చింతనిప్పు జ్యోతి, లావు డ్యా రాజ్‌కుమార్, బదావత్ భద్రు, కోట దేవదత్తం, సుల్తాన్ కొండల్‌రావు, పోతుల నర్సింహారావు ఉన్నారు.

మనోవేదనలో విశ్రాంత ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందక మనోవేదనకు గురవుతున్న విశ్రాంత ఉద్యోగులు బలన్మరణాలకు పాల్పడుతున్నారని విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు ఆరోపించారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిటైర్మెంట్ డబ్బులు రాక మనోవేదనతో మృతిచెందిన వారికి నివాళులర్పిస్తూ కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో బకాయిలు చెల్లించకపోవడంతో విశ్రాంత ఉద్యోగులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారని, ఏళ్లతరబడి అవసరాలకు డబ్బులు అందడం లేదని, అనారోగ్యాలకు గురై ఇళ్లు వదిలి బలన్మరణాలకు పాల్పడుతున్నారన్నారు. రాజ్యాంగంలోని 21చట్టం ప్రకారం ప్రతివ్యక్తి జీవించే హక్కు కలిగి ఉన్నారని, న్యాయస్థానాలు అనేక పర్యాయాలు ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాలని తీర్పులు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేశవరెడ్డి, ప్రకాశరావు, రామిశెట్టి సుబ్బారావు, డీ.కృష్ణయ్య, బీ.దాసు, నర్సయ్య, సాంబశివరెడ్డి, మల్లికార్జునరావు, జీ.కృష్ణయ్య, ఎం.అప్పారావు, ఆంజనేయశాస్త్రీ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

చింతకాని, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిరుమలాపురానికి చెందిన చాపలమడుగు వీరబాబుకు దళితబంధు పథకంలో భాగంగా ఒక కారు మంజూరైంది. ఆ కారును లచ్చగూడెం గ్రామానికి చెందిన తాటికొండ డిసిల్వాకు తాత్కాలిక పద్ధతిలో లీజుకు ఇచ్చాడు. డిసిల్వా ఆ కారును ఖమ్మంకు చెందిన వ్యక్తికి రూ లక్షన్నరకు తాకట్టు పెట్టాడు. ఖమ్మంకు చెందిన ఆ వ్యక్తి అదే కారును ఏపీలోని నూజివీడుకు చెందిన మరో వ్యక్తికి తాకట్టు పెట్టాడు. విషయం తెలుసుకున్న వీరబాబు నూజివీడు వెళ్లి అడగ్గా రూ.లక్ష ఇస్తే కారు ఇస్తానని తేల్చిచెప్పాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించి ముగ్గురిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వీరేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో హమాలీ సంఘం కార్యదర్శి మృతి

కారేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన హమాలి సంఘం కార్యదర్శి కాసగాని రామారావు(55)బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన రామారావు బంధువులకు సంబంధించిన ఫంక్షన్ పాల్వంచలో ఉంటే అక్కడకు వెళ్లాడు. అక్కడే గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు, ఇది గమనించిన బంధువులు హుటాహుటిన ఆస్పత్రికి తీసుకువెళ్తుండగానే మృతి చెందాడు. అతని మృతి హమాలి సంఘగానికి తీరనిలోటు అని పలువురు పెర్కొన్నారు.మృతుడు రామారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.బౌతికాయన్ని కారేపల్లి మండల కేంద్రానికి తీసువచ్చారు.

అగ్రిమెంట్ లేకుండా విత్తన మొక్కజొన్న సాగుచేయొద్దు

వైరా, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సంబంధిత కంపెనీల ఏజెంట్ల నుంచి అగ్రిమెంట్ తీసుకోకుండా విత్తన మొక్కజొన్నను సాగుచేయొద్దని ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ రైతులకు సూచించారు. బుధవారం వైరా రైతువేదికలో జరిగిన డివిజన్ స్థాయి రైతు సమావేశంలో ఆమె మాట్లాడారు. విత్తన మొక్కజొన్న సాగుచేసే రైతులు విధిగా ఏజెంట్ల నుంచి అగ్రిమెంట్ తీసుకోవాలని స్పష్టం చేశారు. బయటి నుంచి వచ్చే ఆర్గనైజర్లు, ఏజెంట్ల ద్వారా విత్తనాలు కొనుగోలు చేయవద్దని, స్థానికంగా తెలిసిన ఆర్గనైజర్లు, ఏజెంట్లతో అగ్రిమెంట్ తీసుకొని వారి ఆధ్వర్యంలోనే విత్తన మొక్కజొన్న సాగుచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు కంపెనీల విత్తన ఏజెంట్లు మాట్లాడుతూ.. తాము రైతులకు అగ్రిమెంట్ బాండ్ ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైరా, కొణిజర్ల, ఏన్కూరు ఏవోలు మయాన్ మంజూఖాన్, డి.బాలాజీ, నర్సింహారావు, వైరా టెక్నికల్ ఏవో అనిల్‌కుమార్, ఏఈవోలు ఎం.రాజేష్, ఎస్.సైదులు, పి.వెంకటనర్సయ్య, ఏ.వాసంతి, రైతులు పాల్గొన్నారు.

పైలేరియాపై అవగాహన

ముదిగొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వల్లభి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ ధర్మేందర్ ముదిగొండ మండలంలోని అయ్యగారిపల్లి, పెద్దమండవ గ్రామాల్లో పైలేరియా బోదకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 210మందికి ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించారు. ఈ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. అలాగే గోకినపల్లి గ్రామంలో వైద్యాధికారిణి అరుణాదేవి పైలేరియా బోదకాలపై అవగాహన కల్పించారు. ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, సూపర్‌వైజర్ రవి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి: భూక్యా

వైరా, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వైరా ప్రాంతంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. బుధవారం తోట నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సీపీఎం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడచిన మూడునెలల నుంచి కురుస్తున్న అధిక వర్షాలతో వైరా ప్రాంతంలో సాగుచేసిన పెసర, మినుము, పత్తి, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ప్రతి పంటకు ఎకరా ఒక్కింటికి రూ.30వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం చెల్లించని పక్షంలో రైతులను సమీకరించి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, నాయకులు సుంకర సుధాకర్, తూము సుధాకర్, కిలారు శ్రీనివాసరావు, మేడా శరాబందీ, బాజోజు రమణ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

ముదిగొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాసరావు రైతులకు సూచించారు. బుధవారం ముదిగొండ మండలం పమ్మి, సువర్ణాపురం, న్యూలక్ష్మీపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్యశిబిరాలను ఆయన పరిశీలించారు. ఇందిరా మహిళా డైరీ గేదెల పాలోత్పత్తికి సంబంధించి లబ్ధిదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి అశోక్, ఏపీఎం లక్ష్మణ్‌రావు, సత్యనారాయణ, ఉమ, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

చింతకాని, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చింతకాని ప్రాథమికి ఆరోగ్య కేంద్రాన్ని ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చందు నాయక్ మంగళవారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాలు నిలువజేసే ఫ్రీజర్స్ నిల్వపద్ధతులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గర్భిణీ స్త్రీల నమోదు, కాన్పుల సంఖ్యపై వైద్యాధికారి అల్తాఫ్‌తో చర్చించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వీరేందర్, ఫార్మసిస్ట్ సీరాజ్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతిలేని ఏపీ ఇసుక లారీల పట్టివేత

పెనుబల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను వీఎంబంజర్ పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. ఆంధ్రాలోని కొవ్వూరు నుంచి ఇసుకను తరలిస్తుండగా పెనుబల్లి మండలం లంకపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. ఒక్కో లారీలో సుమారు 30టన్నుల ఇసుక ఉన్నట్లు తెలిపారు.

తల్లాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు లారీలను బుదవారం తల్లాడ పోలీసులు పట్టుకున్నారు. ఏపీలోని దేవరపల్లి నుంచి ఖమ్మంకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు అందినసమాచారం మేరకు తల్లాడ మండలం కేశ్వాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డులో తల్లాడ ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు లారీలను తనిఖీచేశారు.అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదులారీలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక విలువ సుమారు రూ.2.50లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. ఈమేరకు అక్రమ ఇసుక తరలిస్తున్న పూర్ణతో పాటు పదిమందిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

త్వరలోనే మధిరలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు

» ఏఎంసీ చైర్మన్ బండారు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ నర్సింహారావు

మధిర రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మధిర మార్కెట్‌యార్డులో త్వరలోనే సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, సెక్రటరీ వాత చంద్రశేఖర్‌రావు తెలిపారు. బుధవారం మధిరలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, రైతులు కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. తేమ శాతం 8-12వరకు ఉండవచ్చునని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు. మధిర డివిజన్‌లోని మూడు మండలాల్లో 40వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకొని రైతులు పత్తిని తీసుకురావాలని సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్ అయిలూరి సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్‌లు తుళ్లూరి రాజా, అద్దంకి రవి, బాణోతు వెంకటరమణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, రామారావు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తు చేసుకోవాలి

కారేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రికరుణ పథకం కింద వ్యవసాయపనిముట్ల కోసం అవసరమైన రైతులు ఈనెల 24కల్ల దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి బట్టు అశోక్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, నాఫ్‌సాక్ స్ప్రేయర్లు, రోటవేటర్లు, ట్రాక్టర్ పనిముట్లు, పవర్ వీడర్లు, పవర్ టిల్లర్లు బ్రష్ కట్టర్లు. వరిగట్లు తయారు చేసే మిషన్, వరిగడ్డి మోపు తయారు చేయు యంత్రాలు సబ్సీడిపై అందుబాటులో ఉన్నాయని అన్నారు. సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు క్లస్టర్ పరిధిలో ఉన్నారన్నారు. వారిని సంప్రందించాలన్నారు. అవసరమైన రైతులు దరఖాస్తు ఫారంతోపాటు, ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాపాస్ బుక్ జిరాక్స్, పాస్‌పోర్టుసైజ్ ఫొటో జతచేసి అందించాలన్నారు. ఈనెల 24లోపు సంబంధిత అధికారులకు అందించాలన్నారు.

వైరా, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా వ్యవసాయ పనిముట్ల కోసం ఈనెల 24వతేదీలోగా రైతులు దరఖాస్తులు చేసుకోవాలని వైరా ఏవో మయాన్ మంజూఖాన్ సూచించారు. మండలంలోని ఆయా క్లస్టర్ల పరిధిలోని ఏఈవోల వద్ద దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 50శాతం రాయితీ, మిగిలిన రైతులకు 40శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తామని పేర్కొన్నారు. పరికరాలు కావల్సిన రైతులు తమ పాస్‌బుక్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోతోపాటు దరఖాస్తు ఫారం ఇవ్వాలన్నారు. తైవాన్ స్ప్రేయర్స్, రోటవేటర్స్ అందుబాటులో ఉన్నాయని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విజేతలకు బహుమతుల ప్రదానం

ముదిగొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో గెలుపొందిన విజేతలకు ఎస్ఐ హరిత బహుమతులు ప్రదానం చేశారు. వెంకటాపురం సెయింట్ ఆన్స్ పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ఆమె బహుమతులు అందజేశారు. ముదిగొండ మండల క్రీడల్లో చాంపియన్‌గా బాణాపురం జడ్పీఉన్నత పాఠశాల నిలిచింది. మండలస్థాయి క్రీడల కన్వీనర్ వెంకట్రామిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్, పీడీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

కారేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని తహసీల్దార్ ఏ.రమేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని శాంతినగర్‌లోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. నిత్యవసర సరుకులు నిల్వ ఉన్న గదులలోనే సరుకులు, కూరగాయలు పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులలోనే పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలన్నారు.